# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
11-9-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 170

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి

- అసెంబ్లీ కార్యకలాపాలను అడ్డుకుంటోంది
- అధికారం పోయినా అహంకారం పోలేదు
- వారి కుట్రలను సమర్ధంగా ఎదుర్కోవాలి
- ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బీఆర్ఎస్‌పైనే ప్రజల్లో వ్యతిరేకత ఉంది
- కాంగ్రెస్?కు నష్టం చేసేందుకు కుట్రలు
- బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ రెడ్డి ధ్వజం!
- సభ్యుల పనితీరే గెలుపునకు మూలం
- తెలంగాణ కులగణన దేశానికే ఆదర్శం
- సర్?పై అందరూ అప్రమత్తంగా ఉండండి
- సీఎల్పీ సమావేశంలో రేవంత్ వ్యాఖ్యలు
- ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం
- అసెంబ్లీ ఘటనపై సర్కార్ ఫ్లాష్ సర్వే..



**హైదారాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ వేదికగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం మరింత వేడెక్కింది. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశంలో ఇటీవల అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న పరిణామాలు, ప్రతిపక్షాల వ్యవహారశైలి, ప్రభుత్వ భవిష్యత్ వ్యూహంపై కీలకంగా చర్చించినట్లు సమాచారం. ఈ సందర్భంగా గత మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పరిణామాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించినట్లు చెబుతున్న ఓ ఫ్లాష్ సర్వే ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేల ముందు ప్రస్తావించినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలపై ప్రభుత్వం.. ఫ్లాష్ సర్వే చేయించిందని సీఎం రేవంత్‌రెడ్డి సమావేశంలో తెలిపారు. ఆ సర్వేలో రాష్ట్ర ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత కనిపించలేదని.. బదులుగా బీఆర్ఎస్ నేతల వ్యవహారశైలినే ప్రజలు తప్పుబట్టినట్లు తేలిందని ఆయన పేర్కొన్నారు.

- మిగతా 2వ పేజీలో



## బోరున ఏడ్చిన బొత్స!

**మేనల్లుడు చిన్న శ్రీను దూరం కావడంతో ఆవేదన**

**వైసీపీ సమావేశంలో ఘటన**

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** మాజీ మంత్రి బొత్స ఏడ్చారు. కార్యకర్తల సమావేశంలోనే బోరున విలపించారు. తన మేనల్లుడు చిన్న శ్రీను తనను నమ్మించి మోసగించాడంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చీపురుపల్లి నియోజకవర్గ వైసీపీ శ్రేణుల

- మిగతా 3వ పేజీలో



## కాంగ్రెస్‌కు విజయ్ షాక్!

### ఇండియా కూటమికి నో ఛాన్స్

**తన నేతృత్వంలో ప్రాంతీయ కూటమి ఏర్పాటు**

**జాతీయస్థాయిలో తటస్థ వైఖరి అనే సంకేతాలు**

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** కాంగ్రెస్ పార్టీకి తమిళనాడు సీఎం విజయ్ షాక్ ఇచ్చారు. తన వ్యూహాత్మక రాజకీయాన్ని ప్రదర్శిస్తున్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమిలో ఆయన చేరలేదు. ఆయన నేతృత్వంలోని కొత్త కూటమిలో కాంగ్రెస్ చేరింది. మొన్నటి ఎన్నికల ఫలితాల తర్వాత డిఎంకెను విడిచిపెట్టి.. విజయ్

- మిగతా 3వ పేజీలో

## హిజ్రా 'మాఫియా'!

### తెర వెనుక బలమైన నెట్వర్క్

**నగరంలో ఏ మూల శుభకార్యం జరిగిన ఇట్టే సమాచారం**

**వ్యాపారులు, సేవకులే అసలు సూత్రధారులు**

**ఆటో డ్రైవర్లు, టెంట్ హౌస్ కాంట్రాక్టర్లు సైతం**

**పోలీసుల విచారణలో నమ్మలేని నిజాలు**



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:**

భాగ్యనగరంలో హిజ్రాలకు ఒక మాఫియా నెట్వర్క్ ఉందా? అంతలా విస్తరించిందా? ఎక్కడో మూలన జరిగే చిన్న వేడుక సమాచారం వారికి ఎలా తెలుస్తోంది. కచ్చితంగా దీని వెనుక నెట్వర్క్ ఉంటుంది. ఎక్కడైనా శు భకార్యం జరిగితే చాలు ఇట్టే వాలిపోతున్నారు. ఇదో చిన్న అంశంగా భావించిన పోలీసులు పట్టించుకోలేదు. అదే నెట్వర్క్ పెరిగి ఒక మాఫియాగా మారింది. శాంతి భద్రతలకు తీవ్ర విఘాతం కలిగిస్తోంది.

2లో



## హస్తంతో జగన్ దోస్తీ!

**కెసి వేణుగోపాల్ తో చర్చలను ఖండించని వైసిపి**

**మారిన జాతీయ రాజకీయ వ్యూహం**

**బిజెపి నుంచి లభించని సాయం**

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** జగన్మోహన్ రెడ్డి జాతీయ రాజకీయ వ్యూహం మారుతోందా? ఆయన క్రమేపి కాంగ్రెస్ పార్టీకి దగ్గరవుతున్నారా? బిజెపిని నమ్ముకుంటే ఇబ్బందులు తప్పవని భావిస్తున్నారా? జాతీయస్థాయిలో కాంగ్రెస్ పుంజుకుంటుందని అంచనాకు వచ్చారా? అందుకే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్ తో చర్చలు జరిపారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది.



2లో

## ఆర్మీలో ఇంటి దొంగలు!



**ఆయుధాల చోరీలో కళ్ళు బైర్లు కమ్మే నిజాలు**

**దర్యాప్తులో వెలుగు చూస్తున్న వాస్తవాలు**

**తవ్వే కొద్దీ సంచలనాలే..**

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** ఆర్మీ ఆయుధాలు చోరీ ఇంటి మనుషుల పనియేనా? సొంతవారే ఈ ఘాతకానికి పాల్పడ్డారా? అధికారులే ఈ ఆయుధాలను కొట్టేశారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది.


2లో

## మన రూట్లో ట్రంప్!

**ఎన్నికల్లో గెలిచేందుకు భారీగా నగదు తాయిలాలు**

**లక్షల కోట్లు పంచేందుకు సిద్ధం**

**భారత సంక్షేమ పథకాలే ఆదర్శం**



**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** డబ్బంటే ఎవరికి చేదు. ఈ మాట వంట పట్టించుకున్నారు కాబట్టి మన దేశంలో ఓటును నోటుతో జత చేస్తున్నారు. సంక్షేమ పథకాలతో ప్రజల ఓట్లను కొనుగోలు చేస్తున్నారు. అయితే ఇప్పుడు మన దేశ రాజకీయాలను ఆదర్శంగా తీసుకున్నట్టు ఉన్నారు

## గవర్నర్ వద్దకు జోగి రమేష్ ఫ్యామిలీ పంచాయితీ!

**ఫిర్యాదు చేసిన కోడలు మేఘన**

**తనతో పాటు తన తల్లిదండ్రులకు**

**ప్రాణహాని ఉందంటూ వినతి**

**రక్షణ కల్పించాలని విన్నపం**



2,3

## నాగబాబుకు క్యాబినెట్ హోదా!

**జీతంతో పాటు ఇతర అలవెన్సులు**

**ఏపీ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు**

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో :** క్యాబినెట్ హోదాతో పదవి దక్కించుకున్నారు ఎమ్మెల్సీ నాగబాబు. ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ గా కొద్ది రోజుల కిందట బాధ్యతలు స్వీకరించారు.



**సాక్షాత్తు సీఎం సొంత ఊరిలోనే**

## ఈ దుస్థితా?

**విద్యుత్ రంగాన్ని కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందన్న కేటీఆర్**

**పాతకాలపు కరెంట్ కోతలు పునరావృతమవుతున్నాయని విమర్శ**

**రేవంత్ సొంత గ్రామంలోనే రైతులు విద్యుత్ కోతలతో అల్లాడుతున్నారన్న కేటీఆర్**

# బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 7వ తేదీన అసెంబ్లీ గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వివాదం.. ఎర్రవల్లిలో చోటుచేసుకున్న శుద్ధీకరణ కార్యక్రమం వంటి అంశాలను సీఎం రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో ప్రస్తావించినట్లు సమాచారం. ఈ ఘటనలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను కూడా ఎమ్మెల్యేలకు వివరించినట్లు తెలుస్తోంది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ అసెంబ్లీ కార్యకలాపాలను సజావుగా సాగనివ్వకుండా కుట్ర చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించినట్లు సమాచారం. మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఫామ్‌హౌస్‌లో సమావేశమై సభను అడ్డుకునే వ్యూహాన్ని రూపొందించారని ఆయన విమర్శించినట్లు తెలుస్తోంది. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతలు తమ అహంకార వైఖరిని మార్చుకోలేదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించినట్లు సమాచారం. పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధుల పట్ల అనుచితంగా వ్యవహరించారని.. మహిళా పోలీసు అధికారుల ఎదుట టీషర్టులు విప్పడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించినట్లు తెలుస్తోంది. అలాగే శాసనసభాపతిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సీఎం పేర్కొన్నట్లు సమాచారం. అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాలను ఎదుర్కొని ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రేవంత్‌రెడ్డి అభినందించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేల పనితీరుపైనా సీఎం రేవంత్‌రెడ్డి సమావేశంలో దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ప్రజలు అప్పగించిన పదవిని బాధ్యతగా నిర్వహించాలని, అసెంబ్లీ జరిగే అన్ని రోజుల్లో సభ్యులు పూర్తి స్థాయిలో హాజరై చర్చల్లో పాల్గొనాలని సూచించినట్లు తెలుస్తోంది. తమ తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సభలో ప్రస్తావించాలని ఎమ్మెల్యేలకు సూచించినట్లు సమాచారం. ఎమ్మెల్యేల వ్యక్తిగత పనితీరు, ప్రవర్తన భవిష్యత్ రాజకీయ విజయాలపై ప్రభావం చూపుతుందని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించినట్లు తెలుస్తోంది. మొదటిసారి ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుందని.. వ్యక్తిగత పనితీరే గెలుపు, ఓటములను నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి శాసన సభ్యులకు సూచించారు. కాంగ్రెస్ నుంచి రాజకీయంగా ఎదిగి ప్రస్తుతం ఆ పార్టీపై విమర్శలు చేస్తున్న కొందరు నేతల వ్యవహారశైలిని కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి వంటి నేతలు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా అని ఆయన ప్రశ్నించినట్లు సమాచారం. పోలీసు సిబ్బందిపై జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ.. కేటీఆర్‌కు పోలీసు అధికారుల్లో రేవంత్‌రెడ్డి కనిపించినట్లుగా ఉందని, అందుకే వారిపై అంత ఆగ్రహంతో వ్యవహరించారని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేసినట్లు తెలుస్తోంది. తెలంగాణలో నిర్వహించిన కులగణన దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నట్లు సమాచారం. తెలంగాణ నమూనాలో దేశవ్యాప్తంగా కులగణన చేపట్టేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సూచించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కులగణన ద్వారా వచ్చిన అంశాలను జాతీయ స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. దీనిపై పార్టీ ప్రజాప్రతినిధులు విస్తృతంగా మాట్లాడాలని సీఎం సూచించినట్లు సమాచారం.

# ఆర్మీలో ఇంటి దొంగలు!

అత్యున్నత దర్యాప్తులో ఇంటి దొంగల వ్యవహారమేనని తేలిపోయినట్లు తెలుస్తోంది. దీంతో దర్యాప్తు మరింత ముమ్మరంగా సాగుతోంది.

**చురుగ్గా దర్యాప్తు..**

సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని.. బొల్లారం 20 మద్రాస్ రెజిమెంట్ ఆర్మరిలో ఆయుధాలు మాయం అయిన వ్యవహారం సంచలనం సృష్టించింది. అయితే దొంగలు తాళాలు పగలగొట్టి ఒకేసారి ఈ దోపిడీకి పాల్పడ్డారని అంతా భావించారు. కానీ దర్యాప్తులో కళ్ళు బైర్లు కమ్మేలా నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. మిలటరీ ఇంటలిజెన్స్, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా విచారణ చేపడుతున్నారు. అయితే ఇది ఒకే రోజులో జరిగిన చోరీ కాదని.. పక్కా ప్రణాళిక ప్రకారం నడిచిన ఇంటి దొంగల వ్యవహారమని అధికారులు తేల్చినట్లు తెలుస్తోంది..

**ఆడిట్ లో తేడాతో వెలుగులోకి..**

ఇటీవల ఈ ఆయుధాల చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. వార్షిక ఆయుధాల ఆడిట్లో లెక్కల్లో వ్యత్యాసాలు రావడంతో.. ఈ ఘరానా చోరీ వెలుగులోకి వచ్చింది. గత మూడు నెలల కాలంలో ఒక్కొక్కటిగా ఆయుధాలను దశలవారీగా డిపో నుంచి బయటకు తరలించినట్లు స్థానిక అధికారులు నిర్ధారణకు వచ్చారు. దర్యాప్తు సంస్థల ప్రాథమిక అంచనా ప్రకారం.. అత్యంత ప్రమాదకరమైన నాలుగు ఏకే 47 అసాల్ట్ రైఫిళ్లు, రెండు ఇన్సాస్ రైఫిళ్లు, 9 పిస్టళ్లు, నైట్ విజన్ పరికరాలతో పాటు ఏకంగా 2000 పైగా బుల్లెట్లను మాయం చేశారు. సైనిక కేంద్రం నుంచి ఇంత ఆయుధ సంపత్తి మాయం కావడం రక్షణ శాఖను కుదిపేస్తోంది.

**కుట్రపూరిత నేరంగా..**

అంతా ఒక కుట్రపూరిత నేరంగా దీనిని మార్చినట్లు స్పష్టమవుతోంది. ఆర్మరి వద్ద సీసీటీవీ కెమెరాలను షార్ట్ సర్క్యూట్ నెపంతో రాత్రి వేళల్లో నిలిపివేశారు. భద్రత అలారం లు పనిచేయకుండా కుట్రపూరితంగా వ్యవహరించారు. అసలు ఈ దొంగతనం బయట వారే చేశారని నమ్మించేందుకు.. వర్షం పడుతున్న సమయంలో తాళాలు పగులగొట్టి దొంగతనం జరిగినట్లు పెద్ద డ్రామా ఆడారు. ప్రస్తుతం మిలటరీ ఇంటెలిజెన్స్ ముగ్గురు ఆర్మీ ఉన్నతాధికారులను మేజర్ ర్యాంక్ అధికారులతో సహా.. భద్రతా విభాగంలో పనిచేసే పలువురు జవాన్లను అదుపులోకి తీసుకుని రహస్య ప్రాంతంలో ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇక్కడ మాయమైన ఆయుధాలు ఎక్కడికి వెళ్లాయి? వ్యాపారులకు విక్రయించారా? గ్యాంగ్స్టర్లకు చేరాయా? తీవ్రవాద నెట్వర్కుల చేతికి చిక్కాయ అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

# హిజ్రా 'మాఫియా'!

చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఇప్పుడు పోలీసులు రంగంలోకి దిగి ఈ నెట్వర్క్ మూలాలను తెలుసుకొని ఆశ్చర్యపోతున్నారు.తిలా పాపం తలో పిడికెడు అన్నట్టు.. హిజ్రాలు తాము సంపాదిస్తున్న ఆదాయంలో కొంత మొత్తాన్ని సమాచారం ఇచ్చే నెట్వర్క్ కు ఇస్తుండడంతో పెరిగి పెద్దదయింది ఈ మాఫియా.

**సమగ్ర దర్యాప్తుతో..**

హైదరాబాదులోని వివిధ ప్రాంతాల్లో గృహప్రవేశాలు, వ్యాపార సంస్థల ప్రారంభోత్సవాలు, పెళ్లిళ్లు, కుటుంబ వేడుకలు ఏమి జరిగినా నిమిషాల్లో అక్కడ ప్రత్యక్షమవుతున్నారు కొంతమంది ట్రాన్స్ జెండర్లు, క్రాస్ డ్రెస్సర్లు. వేలాది రూపాయలు డిమాండ్ చేస్తూ దోపిడీలకు పాల్పడుతున్నారు. ఇదో పెద్ద మాఫియాగా కూడా మారింది. బాధితులు సోషల్ మీడియాలో పెట్టిన వీడియోలు, ఫిర్యాదులు ఆధారంగా తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులు దీనిని సీరియస్ అంశంగా తీసుకున్నారు. ఎక్కడో మూలన జరిగే వేడుకల విషయాన్ని వీరికి ఎవరు తెలియజేస్తున్నారు అనే విషయంపై దర్యాప్తు చేశారు. ఈ నెట్వర్క్ గుట్టును రట్టు చేశారు.

**డబ్బు కోసమే..**

శుభకార్యం జరుగుతుందంటే ఉదయాన్నే అక్కడ ప్రత్యక్షమవుతున్నారు ట్రాన్స్ జెండర్లు. అయితే వీరికి సమాచారం ఇచ్చేది మాత్రం స్థానిక వ్యాపారులు, సేవకులు అని స్పష్టమవుతోంది. ఆటో డ్రైవర్లు, టెంట్ హౌస్ కాంట్రాక్టర్లు, శుభకార్యాలు నిర్వహించే పంతుళ్ళు, డెకరేషన్ తో పాటు ఫ్లవర్ వెండర్లు వీరికి సమాచారం అందిస్తున్న పోలీసుల దర్యాప్తులో తేలింది. కొంత డబ్బు కోసం ఈ సమాచారాన్ని వారికి అందిస్తున్నట్లు వెల్లడయింది. శుభకార్యాలకు ఇలా బుక్ చేసుకుంటారో లేదో అప్పుడే వీరు ట్రాన్స్ జెండర్ లకు సమాచారం అందిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

**సీరియస్ గా పోలీసుల దృష్టి..:** హిజ్రాల అంశం శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితికి రావడం పై పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. డీజీపీ సివి ఆనంద్ నుంచి పోలీస్ కమిషనర్ల వరకు వీటిపై సీరియస్ ఆదేశాలు జారీ అయ్యాయి. చట్టాన్ని అతిక్రమించి.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా అసభ్యచాష్టలకు దిగే వారిపై ఎఫ్ఐఆర్లు నమోదు చేస్తున్నారు. ఈ సమాచార నెట్వర్క్ లో భాగమైన ఆటో డ్రైవర్లు, ఫంక్షన్ సేవలందించే వర్గాలను పిలిపించి తెలంగాణ పోలీసులు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇస్తున్నారు. ఇటువంటి సమాచారాన్ని చేరవేస్తూ అక్రమ వసూళ్లకు సహకరిస్తే.. ఆ నేరంలో భాగస్వామ్యులుగా భావించి చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. హైదరాబాదులో సురక్షితమైన వాతావరణం కల్పించడం.. ప్రజలకు మానసిక వేధింపుల నుంచి విముక్తి కల్పించడమే లక్ష్యంగా పోలీసులు చర్యలు వేగవంతం చేశారు.

# సాక్షాత్తు సీఎం సొంత ఊరిలోనే ఈ దుస్థితా?

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేసిందని...తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేసిందని... కేసీఆర్ హయాంలో లభించిన 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ స్థానంలో మళ్లీ పాతకాలపు కరెంటు కోతలు పునరావృతమవుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామైన నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లికి చెందిన రైతులు తమ కష్టాలను వెళ్లబోసుకుంటున్న వీడియోను సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో పంచుకుంటూ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి వచ్చిన అసలైన మార్పు ఇదేనా?" అని కేటీఆర్ తన పోస్టులో ప్రశ్నించారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి పాలమూరు జిల్లాలో, ఆయన సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలోనే రైతులు విద్యుత్ కోతలతో విలవిలలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరిపడా వోల్టేజ్, సమయానికి కరెంటు రాకపోవడంతో పొలాలకు నీళ్లు పారక పంటలు ఎండిపోతున్నాయని, విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయని అన్నారు.

# హస్తంతో జగన్ దోస్తీ!

ఢిల్లీ వర్గాల్లో కూడా దీనిపై విస్తృతంగా చర్చ నడుస్తోంది. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో జాతీయస్థాయిలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితి జగన్ మోహన్ రెడ్డికి ఎదురైంది. అన్ని ఆలోచించి ఆయన కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తోంది.

**బెంగళూరు వేదికగా..**

ప్రస్తుతం బెంగళూరు వేదికగా రాజకీయాలు చేస్తున్నారు జగన్ మోహన్ రెడ్డి. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. తనకు అత్యంత సన్నిహితుడైన డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. అక్కడ బెంగళూరు వేదికగా కాంగ్రెస్ పార్టీతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇటీవల ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్ తో జగన్ సుదీర్ఘంగా చర్చించినట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే ఈ భేటీ వార్తలను అటు కాంగ్రెస్ పార్టీ కానీ.. ఇటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కానీ స్పష్టంగా ఖండించలేదు. దీంతో ఈ అనుమానాలకు మరింత బలం చేకూరింది. కేంద్రంలో అధికార పక్షానికి అనుకూలంగా ఉంటూ వస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. కానీ మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత తన జాతీయ రాజకీయ వ్యూహాన్ని పూర్తిగా మార్చుకుంటున్నారనే సంకేతాలు స్పష్టమవుతున్నాయి.

**మారిన అభిప్రాయం..**

ఏపీ రాజకీయాల విషయంలో జాతీయస్థాయిలో కాంగ్రెస్ అనుకూల సెఫాలజిస్టులు, విశ్లేషకులు సరికొత్త నిర్వచనాలు ఇస్తున్నారు. గత ఎన్నికల్లో ఏపీలో కాంగ్రెస్ పార్టీకి గణనీయమైన ఓటు బ్యాంకు రాకపోయినా.. ఓట్ల చీలిక వైసీపీ విజయవకాశాలను కొంతవరకు దెబ్బతీసింది అనే అంచనా ఉంది. భవిష్యత్తులో వైసిపి, కాంగ్రెస్ ఒకే గొడుగు కిందకు వచ్చిన లేదా ఇండియా కూటమి భాగస్వామిగా వైసీపీ చేరినా.. ఏపీలో కూటమికి గట్టి పోటీ ఇవ్వొచ్చని.. కేంద్రంలోనూ బిజెపికి వ్యతిరేక పక్షంలోకి మారేందుకు జగన్కు రోడ్డు మ్యాప్ సిద్ధమవుతోందని విశ్లేషిస్తున్నారు.

**సహాయ నిరాకరణ..**

మరోవైపు గతం మాదిరిగా కేంద్ర బిజెపి నుంచి జగన్మోహన్ రెడ్డికి పూర్తిగా రక్షణ కొరవడుతోంది. మునుపటి మాదిరిగా పూర్తి సహకారం అందడం లేదు. దానికి కారణం చంద్రబాబు. ఎన్డీఏలో టిడిపి కీలక భాగస్వామి. మూడోసారి మోడీ అధికారంలోకి వచ్చేందుకు ఏపీలో టిడిపి కూటమి సహకారం అనివార్యంగా మారింది. పైగా మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో చంద్రబాబు నమ్మదగిన మిత్రుడిగా మారిపోయారు. ఈ పరిణామ క్రమంలోనే జగన్కు కేంద్ర పెద్దల నుంచి సహాయ నిరాకరణ ఎదురవుతోంది. మరోవైపు ఏపీలో కూడా పార్టీ పట్టు సడలుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ తో పాటు ఇండియా కూటమి సహకారం ఇప్పుడు జగన్మోహన్ రెడ్డికి అవసరం. అందుకే ఆయన కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తున్నట్లు అర్థం అవుతోంది.

# మన రూట్లో ట్రంప్!

అగ్రరాజ్యం అధినేత డోనాల్డ్ ట్రంప్. ఏకంగా అమెరికాలో సంక్షేమ బాట పట్టారు. గెలిపించండి.. నగదు అందుకోండి అంటూ బంపర్ ఆఫర్ ప్రకటించారు. నిజంగా ఇది భారతదేశ సంక్షేమ ఆదర్శమే. ఇక్కడి ఫార్ములాను అమెరికాలో అప్లై చేసి.. రాజకీయ స్థిరత్వాన్ని కోరుకుంటున్నారు డోనాల్డ్ ట్రంప్.

**సంక్షేమానికి మనం మొగ్గు..**

సాధారణంగా మనదేశంలో ఎన్నికలు సంక్షేమ పథకాలు, ఖాతాల్లో నగదు జమ చేసే ఉచిత హామీల చుట్టూ తిరుగుతాయి. వాటిని రాజకీయ పార్టీలు అస్త్రాలుగా మార్చుకుంటాయి. అభివృద్ధి, మౌలిక వసతుల కంటే ప్రజల జేబుల్లో నేరుగా నగదు వేస్తే చాలు.. అధికారం మనదే అన్న ఫార్ములాను భారతదేశంలో రాజకీయ పార్టీలు అనుసరిస్తున్నాయి. ఇప్పుడు అచ్చంగా అదే ఇండియన్ స్టైల్ పాపులిజం, ఫార్ములాను అగ్రరాజ్యం అధినేత డోనాల్డ్ ట్రంప్ ఒడిసి పట్టుకున్నట్టు కనిపిస్తున్నారు. నవంబర్ లో జరిగే మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లు సెనేట్, హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ ఎన్నుకుంటే.. ప్రతి అమెరికన్ కు ఏకంగా 5 వేల డాలర్లు అందిస్తామంటూ ఆఫర్ చేశారు. మన ఇండియన్ కరెన్సీ బట్టి దాదాపుగా 5 లక్షల రూపాయల ట్రంప్ డివిడెంట్ కింద అందిస్తామంటూ ప్రకటన చేశారు.

**వాటిని పక్కన పెట్టి మరి..**

అమెరికాలో ఎన్నికలు సాధారణంగా ద్రవ్యోల్బణం, పన్ను రాయితీలు, ఇమ్మిగ్రేషన్ విధానాలు, విదేశాంగ విధానం వంటి విస్తృత ఆర్థిక, విధానపరమైన అంశాల చుట్టూ తిరుగుతాయి. కానీ ట్రంప్ వాటన్నింటినీ పక్కనపెట్టి.. భారత్లోని సంక్షేమ హామీల తరహాలో.. మీరు మా పార్టీకి ఓటేసి గెలిపిస్తేనే మీ ఖాతాల్లోకి 5,000 డాలర్లు వస్తాయంటూ బహిరంగంగా షరతు విధించడం విశేషం. డల్లాస్ లో జరిగిన రిపబ్లికన్ల సదస్సులో మాట్లాడిన ఆయన.. దేశం ఆర్థికంగా అద్భుత పురోగతి సాధించిందని.. దాని ఫలాలను ప్రజలకు డివిడెంటుగా ఇస్తామని చెప్పుకొచ్చారు. కానీ ఈ డబ్బులు రావాలంటే మాత్రం ఉభయ సభల్లోనూ రిపబ్లికన్లదే మెజారిటీ ఉండాలని గట్టిగానే చెప్పుకొచ్చారు. ఓటర్లను నేరుగా ప్రలోభ పెట్టే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు.

**ఖజానా పై భారీ భారం..**

అయితే అమెరికాలో ఈ ఎన్నికల హామీ ఖరీదు భారీగానే ఉంటుంది. ఖజానా పై భారీగా భారం పడనుంది. సుమారు 24 నుంచి 25 కోట్ల మందికి ఈ నగదు పంపిణీ చేయాలంటే.. ఏకంగా 1.2 ట్రిలియన్ నుంచి 1.35 ట్రిలియన్ డాలర్లు అవసరం అవుతాయి. సాధారణ ఎన్నికల లబ్ధి కోసం ఏకంగా లక్షల కోట్లను పంచేందుకు ట్రంప్ సిద్ధమవుతుండడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఇప్పటికే విదేశీ దిగుమత్తులపై విధించిన భారీ సుంకాల ద్వారా వచ్చిన సొమ్ముతో ఈ పథకాన్ని నడిపిస్తామని ట్రంప్ వర్గాలు చెబుతున్నాయి. కానీ ప్రస్తుతం భారీగా అప్పుల ఊబిలో ఉన్న అమెరికా ఆర్థిక వ్యవస్థ పై ఇది పెను భారమే.

# పదవి ఇచ్చేది అధిష్ఠానం.. రేవంత్‌రెడ్డి కాదు

## కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదారాబాద్: సీఎం, తాను ఎప్పుడూ తిట్టుకోవాలని కొందరి చూస్తున్నారని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. సీఎంతో తనకు భిన్నాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయన్నారు. మంచి జరిగితే మంచి, చెడు జరిగితే చెడు అని చెప్పడం తన నైజమని వివరించారు. అసెంబ్లీలో సీఎల్పీ సమావేశం అనంతరం ఆయన మీడియా చిట్?చాట్ నిర్వహించారు. మంత్రి పదవి కోసం రాజీపడినట్లు ప్రచారం చేస్తున్నారని, కానీ కలిస్తే కాంప్రమైజ్, కలవకపోతె గ్యాప్ పెరిగిందని ప్రచారం చేయడం సరికాదన్నారు. మంత్రి పదవి ఇచ్చేది అధిష్ఠానం కానీ రేవంత్‌రెడ్డి కాదని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు.

# బోరున ఏడ్చిన బొత్స!

సమావేశంలో ఒక్కసారిగా నిర్వేదానికి గురయ్యారు బొత్స. కన్నీటి పర్యంతం అయ్యేసరికి సమావేశంలో ఉన్న వారంతా ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. ఇటీవల బొత్స ఇది రెండవసారి ఏడవడం. గతంలో వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డితో పాటు ఆయన తల్లిని దూషించారంటూ గుర్తు చేశారు మంత్రి అచ్చం నాయుడు. ఆ సందర్భంలో రాను అలా అనలేదని ఏడ్చారు. ఇప్పుడు తన మేనల్లుడు తనకు దెబ్బేశాడు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ బోరునవ్వులపించారు.

**పార్టీ శ్రేణులతో అత్యవసర భేటీ..**

విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్గా ఉన్న చిన్న శ్రీను వైసీపీకి గుడ్ బై చెప్పి టీడీపీలో చేరిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలోని గరివిడిలో పార్టీ శ్రేణులతో సమావేశం అయ్యారు బొత్స. రాజకీయాల్లో ఎన్నో ఒడిదుడుకులు, గెలుపోటములు, సంక్షోభాలను ధైర్యంగా ఎదుర్కొన్న బొత్స.. ఇలా కన్నీరు పెట్టుకోవడం మాత్రం హాట్ టాపిక్ అవుతోంది. జిల్లాలో తన కుడి భుజంగా ఉండేవారు మేనల్లుడు చిన్న శ్రీను. కేవలం విజయనగరం జిల్లాలో మాత్రమే కాదు విశాఖ జిల్లాలో సైతం పార్టీ వ్యవహారాలతో పాటు కుటుంబ రాజకీయాలను నడిపారు. కానీ ఉన్నట్టుండి చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరిపోయారు. ఇది బొత్స కు షాక్ కలిగించే విషయం.. కనీసం ఊహించని పరిణామం.

**కుటుంబంలో చీలిక..:** అయితే తాజా పరిస్థితులు చూస్తుంటే మాత్రం కుటుంబంలో వచ్చిన చీలికతోనే చిన్న శ్రీను టిడిపి వైపు అడుగులు వేసినట్లు అర్థం అవుతోంది. కుటుంబం కోసం తాను అండగా నిలబడితే తన వారసులకు అవకాశాలు లేకుండా పోతున్నాయి అన్న ఆవేదనతోనే చిన్న శ్రీను బయటపడినట్లు అర్థమవుతుంది. అయితే తన మేనల్లుడు తన నుంచి విడిపోవడానికి మాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు బొత్స. పైకి మాత్రం పార్టీలు శాశ్వతం.. మనుషులు వస్తుంటారు పోతుంటారు అని సమర్థించుకునే ప్రయత్నం చేశారు కానీ.. అంతర్గతంగా ఆయన తీవ్ర వేదనకు గురవుతున్నారని అర్థం అవుతుంది. చిన్న శ్రీను బయటకు వెళ్లిపోయిన తర్వాత వైసీపీ సోషల్ మీడియా విరుద్ధ ప్రచారం చేసింది. బొత్స ఉండగా చిన్న శ్రీను ఎవరని.. బొత్స బలం చూసుకునే అంతలా రెచ్చిపోయేవారని.. అసలు చిన్న శ్రీను బయటకు వెళ్ళిపోతే పట్టించుకునేది ఎవరు అంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్నారు. కానీ బొత్స మాత్రం నీరుగారిపోవడంతో వైసీపీ శ్రేణుల్లో డీలా కనిపిస్తోంది. నమ్మకం సన్నగిల్లుతోంది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై స్పష్టత..

## శాసనమండలిలో సభ్యుల పలు ప్రశ్నలకు జవాబిచ్చిన మంత్రి అడ్లూరి

హైదారాబాద్: రాష్ట్రంలోని విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పండిట్లు, వ్యాయామ విద్యా ఉపాధ్యాయుల పోస్టుల అప్‌గ్రేడేషన్‌కు సంబంధించిన అంశాలపై సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలంగాణ శాసనమండలిలో గురువారం శాసన మండలి సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న , తక్కెళ్ళపల్లి రవీందర్ రావ్ , సత్యం నెలికంటి లేవనెత్తిన అంశాలకు మంత్రి అడ్లూరి వివరాలను వెల్లడించారు. విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల పరిస్థితి గురించి ప్రస్తావిస్తూ.. 2025--26 విద్యా సంవత్సరం వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8,591.62 కోట్లుగా ఉన్నాయని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో ప్రైవేటు కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేయడానికి వారి నుంచి ఫీజులు వసూలు చేస్తున్నాయన్న అంశంపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ, అటువంటి పరిస్థితి లేదని స్పష్టం చేశారు.


# నాగబాబుకు క్యాబినెట్ హోదా!

(మొదటి పేజీ తరువాయి)

అయితే తాజాగా ఏపీ ప్రభుత్వం క్యాబినెట్ హోదాను కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నాగబాబు జీతభత్యాలు, సిబ్బంది నియామకం, ఇతర ప్రయోజనాలను ఖరారు చేసింది. పర్యావరణ, అటవీ శాఖ ఉన్నతాధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చింది. ఆర్థిక శాఖ సంబంధిత శాఖలకు సమాచారం అందించింది.

**క్యాబినెట్ హోదా పొందిన వారికి..**

వాస్తవానికి రాష్ట్రంలో క్యాబినెట్ హోదా పొందిన వారికి ప్రభుత్వం నెలకు రెండు లక్షల రూపాయల జీతం ఇస్తోంది. అలాగే ఆఫీస్ కు సంబంధించిన ఫర్నిచర్ ఏర్పాటు చేసేందుకు వన్ టైం గ్రాంట్, వ్యక్తిగత సహాయ సిబ్బంది అలవెన్సులు, ఇతర సౌకర్యాల కల్పనకు మరో రెండున్నర లక్షలు చెల్లిస్తోంది. ఈ లెక్కన నాగబాబుకు జీతంతో పాటు అలవెన్సులు కలిపి మొత్తం నాలుగున్నర




లక్షల రూపాయలు చెల్లిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే తాజా ఉత్తర్వుల్లో 2025 జనవరి 10న జారీ చేసిన జీవో నెంబర్ 7 ను ప్రస్తావించింది. అందుకే నాగబాబు జీతం పై ఒక స్పష్టత వచ్చింది.

**చాలామందికి హోదా..**

ఏపీలో నాగబాబు తో పాటు చాలామందికి క్యాబినెట్ హోదా ఉంది. మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ క్యాబినెట్ హోదాలో ఉన్నారు. అలాగే ప్రభుత్వ సలహాదారులైన చాగంటి కోటేశ్వరరావు, మంతెన సత్యనారాయణ రాజు, మాజీ కార్పొరేటర్ నెట్ పోచంపల్లి శ్రీధర్ రావు లకు క్యాబినెట్ హోదా దక్కింది. వీరందరికీ జీతభత్యాలు, అలవెన్సులకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే జీవోను జారీచేసింది. తాజాగా నాగబాబుకు కూడా క్యాబినెట్ హోదాలో ఇవే జీతభత్యాలు, అలవెన్సులు అందించినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. కాగా ఏపీ క్యాబినెట్ హోదాలో ఉన్న వారిలో చాగంటి కోటేశ్వరరావు, మంతెన సత్యనారాయణ రాజులు ఇప్పటికే ప్రభుత్వం నుంచి వచ్చే జీతం, అలవెన్సులు తిరస్కరించారు.

# గవర్నర్ వద్దకు జోగి రమేష్ ఫ్యామిలీ పంచాయితీ!

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో : ఏపీలో మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబ వ్యవహారం మరో మలుపు తిరిగింది. ఆయన కోడలు మేఘన తన తండ్రి అనంతకృష్ణ గౌడ్ తో కలిసి ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ను కలిశారు. ఆమె ఈ కేసుకు సంబంధించి కొన్ని వీడియో ఆధారాలను గవర్నర్కు అందజేశారు. తన అత్తమామలు జోగి రమేష్, శకుంతల, తన భర్త రాజీవ్, ఇతర కుటుంబ సభ్యుల నుంచి.. తనతో పాటు తన తల్లిదండ్రులకు ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేశారు. తమకు వెంటనే రక్షణ కల్పించాలని.. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గవర్నర్ ను కోరారు. దీంతో ఈ అంశం కొత్త మలుపుకు దారితీసింది.

**కొద్దిరోజులుగా రగడ..**

గత కొద్ది రోజులుగా జోగి రమేష్ కుటుంబంలో కలహాలు రేగిన సంగతి తెలిసిందే. కోడలు మేఘన



ఇబ్రహీంపట్నంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు ఇరుకు కుటుంబ సభ్యులకు సంబంధించి పంచాయితీ జరిగింది. అందులో కొన్ని వీడియోలు సోషల్ మీడియా ద్వారా బయటకు వచ్చాయి. కోడలు మేఘన బాహాటంగానే మాట్లాడారు. తనకు జరిగిన అన్యాయంపై వివరించే ప్రయత్నం చేశారు. ఇప్పుడు నేరుగా గవర్నర్కు ఫిర్యాదు చేశారు మేఘన. పెళ్లి సమయంలో ఐదు కోట్ల రూపాయలు ఖర్చు చేశారు తన తల్లిదండ్రులు అంటూ చెప్పుకొచ్చారు మేఘన. ఏకంగా కిలోన్నర బంగారం, 10 కిలోల వెండి, తొమ్మిది లక్షల రూపాయల ఆడపడుచు కట్నం ఇచ్చిన విషయాన్ని చెప్పుచ్చారు. పెళ్లి తర్వాత అత్తమామలు ఐదు కోట్ల రూపాయల అదనపు కట్నం, ఖరీదైన కార్లు, వజ్రాల నెక్లెస్, వజ్రపు ఉంగరం తీసుకురావాలని వేధించారని మేఘన ఆరోపించారు. గోవా వెళ్ళినప్పుడు తనకు ఈత రాదని తెలిసినా వినలేదని.. తన భర్త రాజీవ్ తనను పడవపై నుంచి నీటిలోకి నెట్టేయడానికి ప్రయత్నించినట్లు చెప్పుకొచ్చారు. తనను ఇబ్రహీంపట్నంలోని జోగి రమేష్ ఇంటి టెర్రస్ పైనుంచి కిందకు తోసేయబోయారని ఆరోపించారు. ఘట్కేసర్ ఫామ్ హౌస్ లో దిండుతో ఊపిరి ఆడకుండా చేసి చంపే ప్రయత్నం కూడా జరిగిందని చెప్పుకొచ్చారు. చున్నీతో ఊపిరి ఆడకుండా చేసి తనపై దాడి కూడా చేశారని ఆరోపించారు.

# పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

**రూ.5 లక్షల ఉచిత సాయం.. తెలంగాణలోనే అమలు**

**రెండో విడతలో 59 వేల గుడిసెలకు ఇందిరమ్మ ఇళ్లు**

**ఏ నియోజకవర్గంలోని పేదలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు**

**ఎంపికలో డ్రాలో పారదర్శకత.. అనర్హులకు చోటు లేదు**

**8 లక్షల ఇళ్లకు ప్రభుత్వంపై సుమారు రూ.40 వేల కోట్ల భారం**

**పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయిస్తున్నాం**

**ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి స్పష్టీకరణ**

హైదారాబాద్, సెప్టెంబర్ 10(ఆర్ఎన్ఏ): పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం శాసనసభలో ఎమ్మెల్యేలు మనోహరరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మేడేపల్లి సత్యం, అక్బరుద్దీన్, వెంకట్రామిరెడ్డి తదితర సభ్యుల ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. పేదలను వారి జీవనోపాధికి దూరంగా 30--40 కిలోమీటర్ల అవతలికి పంపించే విధానం తమ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు. ఎకరం రూ.150--200 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లో కూడా పేదవాడి ఆత్మగౌరవానికి తగినట్లుగా ఇల్లు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని మంత్రి తెలిపారు. డ్రాలో ఎంపికైన ప్రతి లబ్ధిదారుడిని అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు డ్రాలో ఎంపికైనట్లు తేలితే వారి పేర్లను తప్పనిసరిగా తొలగిస్తామని సభ సాక్షిగా స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా అందించిన ఉదాహరణ లేదని, తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.5 లక్షలు అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రూ.5 లక్షలు సరిపోవడం లేదని పలువురు సభ్యులు సూచించారని, ఆ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు. మొదటి విడతలో మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.22,500 కోట్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.11 వేల కోట్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లకు సుమారు రూ.5,500 కోట్లు అవసరమవుతాయని మంత్రి వివరించారు. రెండు విడతల్లోనే సుమారు 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లకు పైగా రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన పేదలకు ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మొదటి విడతలో ప్రభుత్వ అనుమతులతో ఇళ్లు ప్రారంభించి, నిర్మాణంలో చిన్నచిన్న లోపాల కారణంగా నిలిచిపోయిన సుమారు 3,200 ఇళ్లను రాటిఫై చేసి క్లియర్ చేశామని మంత్రి తెలిపారు. వారందరికీ ఈ వారం చివర్లోనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గతంలో రాజకీయ వివక్షతో ఇళ్ల కేటాయింపులు జరిగాయని విమర్శించిన మంత్రి.. తమ ప్రభుత్వం మాత్రం అర్హతే ప్రామాణికంగా ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. ప్రతిపక్ష సభ్యులు సూచించిన అర్హులైన పేదల పేర్లను కూడా పరిశీలించి, అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఎక్కడైనా అర్హులైన పేదలకు అన్యాయం జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల కోసం గుర్తించిన ప్రభుత్వ స్థలాలు, సేకరించిన భూముల్లో ఇంకా కేటాయింపులు జరగని స్థలాలను గుర్తించి, అర్హులైన పేదలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నెల రోజుల్లోగా ఆయా నియోజకవర్గాల్లో అర్హులైన పేదలకు ఈ స్థలాలు అందించేలా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. ఇంటి నిర్మాణంలో ప్రధానమైన సిమెంట్ ధరను పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సిమెంట్ కంపెనీలతో చర్చలు జరిపామని మంత్రి తెలిపారు.

# 8,283 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

**వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**

**రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి**

**సంబంధిత శాఖల అధికారులకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశం**

హైదారాబాద్: 2026-27 వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 2026-27 వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 57.7 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, సుమారు 119.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు సీఎస్ తెలిపారు. ఇందులో సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. 2026-27 వానాకాల ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సీఎస్ సంజయ్ జాజు గురువారం డా. బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. గత వానాకాలం సీజన్‌లో సుమారు 70 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి, 154.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సీఎస్ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8,283 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సీఎస్ వెల్లడించారు. ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఇతర కొనుగోలు ఏజెన్సీల సమన్వయంతో కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం ప్రారంభమవుతుందని, నవంబర్‌లో పెద్దఎత్తున ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ధాన్యం రవాణా, హమాలీల ఏర్పాటు, గోదాములు, నిల్వ సామర్థ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించాలని సీఎస్ సూచించారు. రైతుల ఆధార్ వివరాలను చెల్లింపుల కోసం ఉపయోగించే బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేసే ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, రవాణా, నిల్వ, చెల్లింపుల ప్రక్రియలో ఎక్కడా జాప్యం లేకుండా శాఖల మధ్య సమన్వయం ఉండాలని, రైతులకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యవ

సాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డీ.ఎస్. చౌహాన్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి తదితర ఉన్నతాధికారులు

# కాంగ్రెస్‌కు విజయ్ షాక్!

వెంట కాంగ్రెస్ నడిచిన సంగతి తెలిసిందే. ఆయన ప్రభుత్వంలో సైతం కాంగ్రెస్ కీలక భాగస్వామిగా మారింది. అయితే తాజాగా కాంగ్రెస్, వి సి కె, ఎండిఎంకె, ఐయూఎంఎల్ అగ్ర నేతలతో ఒక సమావేశం నిర్వహించారు సీఎం విజయ్. అనంతరం తన కూటమికి సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ ఆలయన్స్ అని పేరు పెట్టారు. ఉమ్మడి కనీస ప్రణాళిక, కూటమి నిర్వహణకు ఒక స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

**కమ్యూనిస్టులు దూరం..**

విజయ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి దూరంగా కమ్యూనిస్టులు ఉన్నారు. కేంద్రంలో ప్రతిపక్షాల ఐక్యత కోసం ఏర్పడింది ఇండియా కూటమి. కానీ అందులో నేరుగా భాగస్వామి కాలేదు. తమిళనాడు స్థాయిలో విజయ్ ఒక ప్రత్యేక కూటమిని ఏర్పాటు చేయడం వెనుక బలమైన వ్యూహం ఉంది. డీఎంకే నేతృత్వంలో కొనసాగుతున్న కూటమికి ప్రత్యామ్నాయంగా.. ద్రవిడ సిద్ధాంతాలు, సామాజిక న్యాయం ప్రాతిపదికన ఒక కొత్త రాజకీయ శక్తిగా ఎదగడమే విజయ్ ముందున్న లక్ష్యం. ఇండియా కూటమి పరిధిలోకి వెళ్తే జాతీయస్థాయి రాజకీయ ఒత్తిళ్ళు, నిర్ణయాల వల్ల తన ప్రాంతీయ గుర్తింపు దెబ్బతింటుందని ఆయన భావిస్తున్నారు. అందుకే తమిళనాడులోని సెక్యులర్ ఓటు బ్యాంకు ను తన వైపు తిప్పుకునేలా ఈ ప్రాంతీయ కూటమికి శ్రీకారం చుట్టారు.

**రాహుల్ ఆలోచనలకు భిన్నం..**

జాతీయస్థాయిలో విపక్షాల ఐక్యత కోసం ఏర్పాటు చేశారు ఇండియా కూటమిని. కాంగ్రెస్ పార్టీ దానికి నాయకత్వం వహిస్తోంది. ఎందుకంటే కాంగ్రెస్తో పోటీపడిన మిగతా ప్రాంతీయ పార్టీలు వెనుకబడిపోయాయి. మమతా బెనర్జీ తోపాటు కేజ్రీ వాల్ లాంటి వారు సొంత రాష్ట్రాల్లో ఓడిపోవడంతో కాంగ్రెస్ పార్టీకి జై కొట్టాల్సిన పరిస్థితి. ఈ తరుణంలో విజయ్ కూడా తమ రూట్లోకి వస్తారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భావించారు. అందుకే దశాబ్దాల స్నేహాన్ని విడిచిపెట్టి స్టాలిన్ కు దూరమయ్యారు. విజయ్ స్నేహాన్ని అందుకున్నారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి కూడా హాజరయ్యారు. కానీ తనది ఇండియా కూటమి కాదు అని.. తానే స్వయంగా ఒక ప్రాంతీయ కూటమిని ప్రకటించడం మాత్రం విజయ్ వ్యూహాత్మక విజయం అని చెప్పొచ్చు. కాంగ్రెస్ పార్టీకి ఇది షాకింగ్ పరిణామమే.

# ఈనెల 17 న ఘనంగా ప్రజా పాలనా దినోత్సవం

**పబ్లిక్ గార్డెన్ లో విస్తృత ఏర్పాట్లు చేయాలి**

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**ఏర్పాట్లపై సచివాలయంలో సిఎస్ సమీక్ష**

హైదారాబాద్: ఈనెల 17 వతేదీన నాంపల్లి లోని పబ్లిక్ గార్డెన్ లో నిర్వహించే తెలంగాణా ప్రజా పాలన దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ప్రజాపాలన దినోత్సవం నిర్వహణా ఏర్పాట్లపై గురువారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు నవీన్ మిట్టల్, క్రిస్టినా చొంగ్తూ, శిఖా గోయల్, హైదాబాద్ సి.పీ సజ్జనార్, ఆర్టీసీ ఎండి నాగి రెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితర సీనియర్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ప్రజా పాలనా దినోత్సవాన్ని పబ్లిక్ గార్డెన్ లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 17 న ఉదయం అసెంబ్లీ ఎదురుగా గల అమరవీరుల స్థూపం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి నివాళులు అర్పించిన అనంతరం పబ్లిక్ గార్డెన్ కు వస్తారని తెలిపారు.

# లడఖ్‌కు త్వరలోనే ప్రత్యేక హోదా..

**ఆర్టికల్ 371 సవరణకు కేంద్రం కసరత్తు**

న్యూఢిల్లీ: గత నాలుగేళ్లుగా లడఖ్ ప్రజలు చేస్తున్న డిమాండ్ నెరవేరే సూచనలు కనిపిస్తున్నాయి. లడఖ్ ప్రాంతానికి ఆర్టికల్ 371 కింద రాజ్యాంగ పరిరక్షణలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. అలాగే హిమాలయ ప్రాంతమైన లడఖ్ పాలన కోసం భారతదేశంలోనే మొదటిసారిగా 'సూయి జెనెరిస్' నమూనాలో ఒక ఎన్నికైన పాలక మండలిని ఏర్పాటు చేయనున్నారు. ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో లడఖ్ చీఫ్ సెక్రటరీ ఆశిష్ కుంద్రా మాట్లాడుతూ.. లడఖ్‌కు తగిన రాజ్యాంగ పరిరక్షణలు కల్పించేందుకు పార్లమెంట్ ఆర్టికల్ 371ని సవరిస్తుందని తెలిపారు. లడఖ్‌కు రాజ్యాంగ పరిరక్షణలు కల్పించడం, ఎన్నికైన మండలిని ఏర్పాటు చేసే ప్రక్రియను కేంద్ర హోం శాఖ ఇప్పటికే ప్రారంభించిందని ఆయన చెప్పారు.


GHMC
hmda Growing Global
TS-bPASS


MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595



మనం రోజువారీ జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఈ విచిత్రమైన పరిస్థితిని గమనించే ఉంటాం. ఆఫీసుకు ఒక పది నిమిషాలు ఆలస్యంగా వెళ్తాం, బాస్ మనల్ని చూసి చూడనట్టు వెళ్ళిపోతున్నా, మనమే వెనక్కి పిలిచి మరీ దారిలో ట్రాఫిక్ వల్ల లేట్ అయిందని చెబుతాం. స్నేహితుడికి ఫోన్ చేయడం కాస్త ఆలస్యమైతే వాడు అసలు అడగకముందే, నిన్న పనిలో చాలా బిజీగా ఉన్నానని సర్దిచెప్పుకుంటాం. సోషల్ మీడియాలో ఒక ఫోటో పెట్టి దాని కింద ఇది పాత ఫోటోనే లేండి అని ముందే ఒక క్యాప్షన్ ఇస్తాం.

# అనవసరపు సంజాయిషీలు: భయమా? ఆత్మరక్షణ తపనా?

నిజానికి అక్కడ ఎవరూ మనల్ని ప్రశ్నించలేదు, ఎవరూ వివరణ కూడా కోరలేదు. అయినా సరే మనసులో ఒక రకమైన తొందరపాటు, ఎదుటివారు మనల్ని ఎక్కడ తప్పుగా అనుకుంటారో అన్న ఒక చిన్నపాటి గుబులు నిరంతరం వెంటాడుతూనే ఉంటుంది. దీన్నే మనస్తత్వ శాస్త్ర పరిభాషలో "అన్ సోలిసిటెడ్ జస్టిఫికేషన్" అంటారు. అంటే అడగని చోట ఇచ్చే అనవసరపు సంజాయిషీ. ఈ అలవాటు మనలో ఎందుకుంది, ఇది మన వ్యక్తిత్వంలోని లోపమా లేక మానవ సహజ నైజమా అనేది ఆసక్తికరమైన ప్రశ్న.మన ప్రతి చర్య వెనుక ఒక కారణం ఉంటుంది, కానీ ఆ కారణాన్ని లోకానికి చాటి చెప్పాల్సిన అవసరం మనకెందుకు కలుగుతుందో ఆలోచించాలి. దీని వెనుక భయం, గుర్తింపు కోసం తపన, సంబంధాలను కాపాడుకోవాలనే ఆరాటం అన్నీ కలగలిసి పనిచేస్తాయి. ప్రముఖ మనస్తత్వవేత్త లియోన్ ఫెస్టింజర్ ప్రతిపాదించిన కాగ్నిటివ్ డిసోనెన్స్ అంటే జ్ఞానాత్మక వైరుధ్య సిద్ధాంతం ఇక్కడ ఎంతగానో వర్తిస్తుంది. మన ఆలోచనలకు, మన ప్రవర్తనకు మధ్య ఎప్పుడైనా పొంతన కుదరనప్పుడు మనసులో ఒక విధమైన తీవ్రమైన అసౌకర్యం కలుగుతుంది. ఆ అసౌకర్యాన్ని పోగొట్టుకోవడానికి, మనల్ని మనం సమర్థించుకోవడానికి మనం ఇలాంటి వివరణల ఆశ్రయం పొందుతుంటాం. సంజాయిషీలు ఇవ్వడం అనేది మన బలహీనత కాకపోవచ్చు, కానీ అది మనం ఎదుటివారి మనసులో సదభిప్రాయంతో నిలవాలనుకుంటున్నామని ఇచ్చే ఒక సున్నితమైన సంకేతం. ఈ అనవసరపు సంజాయిషీల వెనుక ప్రధానంగా నాలుగు బలమైన ప్రేరణలు కనిపిస్తాయి. మొదటిది సామాజిక ఆమోదం కోసం చూడటం. మానవుడు పుట్టుకతోనే సంఘజీవి కాబట్టి చుట్టూ ఉన్నవారు మన గురించి ఏమనుకుంటున్నారనేది మన ఉనికికే సంబంధించిన ప్రశ్నగా మారిపోయింది. రెండవది అపరాధ భావన. తప్పు చేశామన్న భావన లేదా మన అంతరాత్మలో ఎక్కడో ఒక చిన్న సందిగ్ధం ఉంటే చాలు, వెంటనే వివరణల పరంపర మొదలవుతుంది. మూడవది ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం. ప్రతి మనిషికి తన గురించి తను ఒక ఊహాచిత్రాన్ని గీసుకుంటాడు, ఆ ఇమేజ్ ఎక్కడ డ్యామేజ్ అవుతుందోనన్న భయంతో పరిస్థితులను సాకుగా చూపిస్తుంటాం. ఇక నాలుగోది పారదర్శకతపై ఉన్న ప్రేమ. సంబంధాల్లో ఎటువంటి అపోహలకు తావుండకూడదనే ఉద్దేశంతో కొందరు ముందే విషయాలను స్పష్టం చేస్తారు.అవసరమైన చోట వివరణ ఇవ్వడం బంధాలను బలపరుస్తుంది, కానీ అడగకముందే అతిగా సంజాయిషీలు ఇవ్వడం వల్ల అనేక ప్రతికూలతలు ఉన్నాయి. అతిగా వివరణలు ఇచ్చే వారిని సమాజం ఒక్కోసారి నమ్మదు. నేను దొంగతనం చేయలేదని అడగకముందే పది సార్లు చెబితే నిజంగానే చేశాడేమోనన్న అనుమానం కలుగుతుంది. అతి వివరణలు మనలోని అభద్రతా భావాన్ని బయటపెట్టి మనల్ని బలహీనంగా చూపుతాయి. ముఖ్యంగా మన తెలుగు సమాజంలో ఈ ధోరణి కొంచెం ఎక్కువే అని చెప్పాలి. మనది సమిష్టి సంస్కృతి కావడం వల్ల ఇక్కడ వ్యక్తిగత నిర్ణయాల కంటే సామాజిక అంగీకారానికి విలువ ఎక్కువ. నాలుగు గోడల మధ్య జరిగిన విషయం బయటపడితే పరువు పోతుందనే ఆందోళన మనల్ని నిరంతరం సంజాయిషీలు ఇవ్వమని ప్రేరేపిస్తుంది. ఈ వలయం నుండి బయటపడటానికి కొద్దిపాటి ఆత్మపరిశీలన అవసరం. ఏదైనా వివరణ ఇచ్చే ముందు ఒక క్షణం ఆగి, నేను ఇది ఎందుకు చెప్పాలనుకుంటున్నాను, అవతలి వ్యక్తి అడిగారా, చెప్పకపోతే వచ్చే నష్టమేంటి అని ప్రశ్నించుకోవాలి. కొన్నిసార్లు మౌనం కంటే గొప్ప వివరణ మరొకటి ఉండదు. మన స్వయం మూల్యం ఎదుటివారి ఆమోదంపై ఆధారపడి ఉండకూడదు. ఈ ప్రపంచంలో అందరినీ సంతృప్తి పరచడం అసాధ్యం. మనం ఎంత వివరించినా అర్థం చేసుకోవాలనుకునే వారు వివరణ లేకుండానే అర్థం చేసుకుంటారు, అపార్థం చేసుకోవాలనుకునే వారు మన వివరణలో కూడా తప్పులు వెతుకుతారు. అందుకే వివరణలు పక్కనపెట్టి మన ప్రవర్తననే మన నిజాయితీకి సాక్ష్యంగా నిలపడం నేర్చుకోవాలి.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169




## అమరేశ్వర ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ..!!

**అయ్యప్ప ఆలయ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన ట్రస్ట్ రద్దు**

**ఆలయ అభివృద్ధిపై శుక్రవారం కీలక సమావేశం**

**గ్రామ ప్రజలంతా హాజరు కావాలని సర్పంచ్ పిలుపు**

క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి: అంబటిపల్లి మేడిగడ్డ గ్రామంలోని శ్రీ అమరేశ్వర ఆలయ అభివృద్ధి, నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్లేందుకు నూతన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు గ్రామ సర్పంచ్ గుజ్జుల లావణ్య శంకర్ తెలిపారు. గతంలో అయ్యప్ప ఆలయ నిర్మాణం కోసం అమరేశ్వర అయ్యప్ప ట్రస్ట్ ఏర్పాటు చేసినప్పటికీ, ప్రస్తుతం నిర్మాణ పనులు కొనసాగకపోవడంతో సదరు కమిటీని రద్దు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇకపై అమరేశ్వర ఆలయానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు, అభివృద్ధి, నిర్మాణ పనులను సమన్వయం చేసేందుకు గ్రామ ప్రజల సమిష్టి కృషితో కొత్త కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు అమరేశ్వర ఆలయం వద్ద సమావేశం నిర్వహించనున్నట్లు సర్పంచ్ వెల్లడించారు. గ్రామ పెద్దలు, వివిధ కుల సంఘాల నాయకులు, సంఘ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఆలయ భక్తులు, గ్రామ యువకులు, ప్రజలు తప్పనిసరిగా హాజరై నూతన కమిటీ ఏర్పాటులో భాగస్వాములు కావాలని కోరారు. అమరేశ్వర ఆలయ అభివృద్ధికి సర్పంచ్‌తో పాటు గ్రామ ప్రజలందరూ సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, గతంలో అమరేశ్వర అయ్యప్ప ట్రస్ట్‌కు విరాళాలు అందించిన దాతలకు వారు ఇచ్చిన విరాళాలను తిరిగి అందజేయనున్నట్లు సర్పంచ్ గుజ్జుల లావణ్య శంకర్ తెలిపారు.

## ఓల్డ్ ఎంఐజీలో అక్రమ అంతస్తుల కూల్చివేత!

**అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు.. అధికారుల కొరడా**

**డీసీ ప్రదీప్‌కుమార్ పర్యవేక్షణలో టౌన్ ప్లానింగ్ అధికారుల చర్యలు**



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 10: పటాన్‌చెరువు నియోజకవర్గంలోని భారతీనగర్ డివిజన్ పరిధి ఓల్డ్ ఎంఐజీలో అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన అదనపు అంతస్తులపై అధికారులు కొరడా ఝుళిపించారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను గుర్తించిన అధికారులు కూల్చివేత చర్యలు చేపట్టారు. అమీన్‌పూర్ డీసీ ప్రదీప్‌కుమార్ పర్యవేక్షణలో టౌన్ ప్లానింగ్ అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది కూల్చివేత ప్రక్రియను నిర్వహించారు. భవన నిర్మాణ అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన అదనపు అంతస్తులను తొలగించారు. పట్టణ ప్రణాళిక నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలపై తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## మిర్యాలగూడకు రెండు కళాశాలలు ఇవ్వండి

**అసెంబ్లీలో ఎమ్మెల్యే బీఎల్ఆర్ విజ్ఞప్తి**



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, సెప్టెంబరు 10: మిర్యాలగూడ నియోజకవర్గానికి అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల, స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలను మంజూరు చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) ప్రభుత్వాన్ని కోరారు. గురువారం అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గ ప్రజల తరఫున ఆయన పలు అంశాలను ప్రస్తావించారు.వ్యవసాయాధారిత ప్రాంతమైన మిర్యాలగూడలో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేస్తే రైతు కుటుంబాల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ సాగు పద్ధతులపై విద్యను అభ్యసించే అవకాశం లభిస్తుందన్నారు.అదేవిధంగా నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాల అవసరమని పేర్కొన్నారు. పరిశ్రమలు, వివిధ రంగాల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందిస్తే ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు.రైతులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెండు కళాశాలలను మంజూరు చేయాలని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని బీఎల్ఆర్ కోరారు.

## ఖమ్మంలో దారుణం...

**భార్యను చంపి శవాన్ని కారులో వేసుకుని....**

**ఓ చోట కారును పార్క్ చేసి..**

**ఘటనను స్నేహితునికి ఫోన్ ద్వారా సమాచారం**



ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: ఖమ్మం నగరంలో దారుణ ఘటన వెలుగు చూసంది. ఓ వ్యక్తి తన భార్యను గొంతు నులిమి చంపి, కారులోనే ఆమె మృతదేహాన్ని తీసుకుని, ఓ చోట కారును పార్క్ చేసి, ఘటనను స్నేహితునికి ఫోన్ ద్వారా సమాచారం అందించిన ఉదంతం తీవ్ర కలకలం రేపింది. ఫోన్ సిగ్నల్ ద్వారా ఖమ్మం పోలీసులు నిందితుని ఆచూకీని పసిగట్టి అతన్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోలీసు వర్గాల కథనం ప్రకారం వివరాల్లోకి వెడితే.. ఇల్లెందుకు చెందిన మేడిపల్లి విద్యాసాగర్ (44) అనే వ్యక్తి కారు డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాల కారణంగా మొదటి భార్యతో విడాకులు తీసుకుని, ఆ తర్వాత తనకు పరిచయమైన చిన్నబోయిన రేణుక అనే మహిళను నాలుగు నెలల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. ఖమ్మంలోని సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఏరియాలోనే రేణుకతో కలిసి నివాసముంటున్నాడు.

**కారులో నిర్జీవంగా రేణుక**

అయితే రేణుకకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందనే అనుమానం విద్యాసాగర్ లో కలిగింది. దీంతో ఇరువురి మధ్య కుటుంబ కలహాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలోనే విద్యాసాగర్ నిన్న సాయంత్రం వేళ తన రెండో భార్య రేణుకను తన కారులో ఎక్కించుకుని బయటకు తీసుకువెళ్లాడు. కారులో ప్రయాణిస్తున్న సమయంలోనే ఇరువురి మధ్య ఘర్షణ ప్రారంభమైంది. ఈ పరిణామాల్లోనే విద్యాసాగర్ రేణుక గొంతు నులిమి చంపేశాడు. తాను తన భార్యను చంపినట్లు విద్యాసాగర్ ఇల్లెందులోని తన స్నేహితునికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. తాను కూడా చనిపోతున్నట్లు తెలిపాడు. దీంతో విద్యాసాగర్ స్నేహితుడు కలవరపడి రఘునాథపాలెం సీఐకి ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో సీఐ అప్రమత్తమై విద్యాసాగర్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా అతని ఆచూకీని కనిపెట్టారు. గత రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఖమ్మం-ఇల్లెందు రోడ్డులోని ప్రగతి స్కూల్ దగ్గర విద్యాసాగర్ ఉన్నట్లు గ్రహించారు.

**నిందితుడు విద్యాసాగర్**

విద్యాసాగర్ ఫోన్ నెంబర్ కు పోలీసులు రింగ్ చేసి, ప్రగతి స్కూల్ పక్కనే నిలిపి ఉంచిన ఓ కారు సమీపాన అతను ఉన్నట్లు గ్రహించి వెంటనే అదుపులోకి తీసుకున్నారు. విద్యాసాగర్ గొంతు నులిమి చంపిన అతని భార్య రేణుక మృతదేహం గల కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం నిందితుడు ఖమ్మం అర్బన్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. అయితే రేణుకను విద్యాసాగర్ ఎక్కడ చంపాడు? చంపిన తర్వాత ఆమె మృతదేహంతో ఎక్కడి నుంచి ఖమ్మం వరకు ఎంత దూరం ప్రయాణించాడు? వంటి అనేక ప్రశ్నలపై పోలీసులు విచారణ చేస్తున్నారు. గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన ఖమ్మం నగరంలో తీవ్ర కలకలం రేపింది. పూర్తి వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

## ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

**ప్రజా సమస్యలపై పోరాడాలి: బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి షోయబ్**



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, సెప్టెంబరు 10: తెలంగాణ ప్రజల తెగువ, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్డులో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా 7వ వార్డు కౌన్సిలర్ సందేశి రజిని రాజు, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ. షోయబ్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు నల్లగంతుల నాగభూషణం, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రాములు గౌడ్, ఉపసర్పంచ్ నారాయణదాసు, ఉద్యమవీరుడు ప్రసాద్ మాలోతు తదితరులు పాల్గొని ఐలమ్మకు నివాళులర్పించారు.

## సైబరాబాద్ పోలీస్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం...

**నూతన సభ్యులకు సీపీ డా. రమేష్ అభినందనలు....**

క్రైమ్ మిర్రర్ సైబరాబాద్ : సైబరాబాద్ పోలీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా ఎస్సై శ్రీనివాస్ (హెచ్‌సీ--3046), ఉపాధ్యక్షుడిగా ఇన్‌స్పెక్టర్ శ్రీకర్‌బాబు (19435) ఎన్నికయ్యారు. ఎస్సై/ఏఎస్సై కేటగిరీలో ప్రియదర్శిని (3251), హెడ్ కానిస్టేబుల్ కేటగిరీలో కార్తిక్ శ్రీనివాస్ (3276), పోలీస్ కానిస్టేబుల్ కేటగిరీలో రాజేందర్ (5180) వైస్ ప్రెసిడెంట్లుగా ఎన్నికయ్యారు.వివిధ పదవులకు మొత్తం 29 మంది సభ్యులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ వారికి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ ద్వారా సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.




క్రైమ్ మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 11-9-2026


# పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై రామప్పలో సినిమా చిత్రీకరణ

### తెలుగు కన్నడ భాషలలో "పినాక" సినిమా చిత్రీకరణ

### అక్టోబర్ 2న విడుదలకు సన్నాహాలు

**వెంకటాపూర్ (రామప్ప), క్రైమ్ మిర్లర్, సెప్టెంబర్ 10:** పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతి ప్రసాద్ కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్న కన్నడ, తెలుగు భాషలలో "పినాక" మూవీ సినిమా గురువారం పాలంపేట గ్రామంలోని ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయంలో షూటింగ్ చిత్రీకరణ ప్రారంభించారు. దర్శకుడు ధనుంజయ పలు సెట్టింగులు పొందుపరిచి హీరో గణేష్ పై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా దర్శకుడు ధనుంజయ మాట్లాడుతూ ...ఈ చిత్రం కన్నడ మరియు తెలుగు భాషల్లో చేస్తున్నామని, ఈ చిత్రం ఒక సంరక్షణ వంశాన్ని అనుసరిస్తూ రెండు విభిన్న యుగాలలో సాగే పౌరాణిక ఫాంటసీ చిత్రం అని, సినిమా పేరు "పినాక" అని తెలిపారు. ఇందులో నటుడు గణేష్ ఒక పరివర్తనాత్మకమైన ప్రధాన పాత్ర పోషిస్తున్నాడని అన్నారు. హీరో, హీరోయిన్లుగా గణేష్, నయన్ సారిక నటిస్తున్నారని, ఇంకా ఈ సినిమాలో సాధు కోకిల, రాఘయన రఘు, అర్చన అయ్యర్, గిరి, శివన్న, శ్రీనివాసు మూర్తి తదితరులు నటిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 2న విడుదల చేయబోతున్నట్లు దర్శకుడు తెలిపారు. ఈ సినిమా రామప్పలో మూడు రోజులపాటు చిత్రీకరణ జరుగుతుందని



పేర్కొన్నారు. ముందుగా శ్రీ రామలింగేశ్వర స్వామి వారినీ దర్శించుకుని దేవాలయం యొక్క విశిష్టతను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రామప్ప దేవాలయం కార్యనిర్వాహణాధికారి ఇమ్మడి భాస్కర్, గైడ్ లు విజయ్ కుమార్, వెంకటేష్, టూరిస్ట్ పోలీసులు అరుణ్ కుమార్, శ్రీను, శ్రీకాంత్ పురావస్తు, టూరిజం, దేవదాయ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



## దళిత జర్నలిస్టుల ఐక్యతకు సంగారెడ్డి వేదిక

### అక్టోబర్ 7న ఐజీఖీ 11వ రాష్ట్ర మహాసభలు

### మహాసభలను విజయవంతం చేయాలి

### వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాన్

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 10: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో అక్టోబర్ 7న నిర్వహించనున్న దళిత జర్నలిస్టు ఫోరం 11వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాన్ పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాలను గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కాశపోగు జాన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళిత జర్నలిస్టులంతా ఐక్యంగా ముందుకు వచ్చి మహాసభల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. దళిత జర్నలిస్టుల సమస్యలు, హక్కులు, వృత్తిపరమైన అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు రాష్ట్ర మహాసభలు కీలక వేదికగా నిలుస్తాయని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి దళిత జర్నలిస్టులు మహాసభలకు తరలివచ్చి విజయవంతం చేయాలని, దళిత జర్నలిస్టుల ఐక్యతను చాటాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు యాదగిరి, తాటికొండ కృష్ణ, డిజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగత్ ప్రకాష్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నాయకుడు కొమ్ము దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు వేడుకల్లో అపశృతి

### రామప్ప గార్డెన్ లో బంగారు గొలుసు ను పోగొట్టుకున్న బాలుడు

**వెంకటాపూర్ (రామప్ప), క్రైమ్ మిర్రర్, సెప్టెంబర్ 10:** తమ ముద్దుల బాబుని పుట్టినరోజు వేడుకలు పాలంపేట గ్రామంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన రామప్ప దేవాలయం లో ఘనంగా జరుపుకుందామని ఉత్సాహంతో వచ్చిన హైదరాబాద్ కు చెందిన మౌనిక దంపతులకు తీవ్ర మనోవేదన కు గురిచేసింది. ఉదయం స్వామివారి పూజలు ముగించుకుని గార్డెన్ లో సేదతీరుతూ పుట్టినరోజు వేడుకలకు ఉపక్రమించుతుండగా అకస్మాత్తుగా తమ బాబు మెడలో వేసిన బంగారు గొలుసు మాయమవడంతో ఆ దంపతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఎంతో భక్తిశ్రద్ధలతో , ఆనందాలతో రామప్ప దేవాలయంలో వారి బాబును పుట్టినరోజు వేడుకలు సంతోషకరంగా జరుపుకుందామనే ఆలోచనతో వస్తే వారి ఆశ ఆవిరైంది. జన్మదిన వేడుకల సందర్భంగా వారి కుమారుని దైవదర్శనం తర్వాత రామప్ప పురావస్తు శాఖకు చెందిన గార్డెన్ లో సేద తీరుతున్న సందర్భంలో ఐదు సంవత్సరాల బాలుడు ఆడుకుంటుండగా తన మెడలో ఉన్నటువంటి సుమారు రూ, 1,70,000 విలువ గల చైన్ పోవడం జరిగింది. గార్డెన్లో సుమారు మూడు, నాలుగు నెలల కాలంగా గడ్డి ఏపుగా పెరగడంతో కొన్ని గంటల పాటు ఆ దంపతులే కాకుండా



అందులో పనిచేసే సిబ్బంది, వచ్చిన భక్తులు సైతం వెతికినప్పటికీ అది దొరకలేదు. సుదూర ప్రాంతం నుండి వచ్చినటువంటి పర్యాటకులకు, భక్తులకు ఎంతో సంతోషంగా జరుపుకుందాం అన్న ఆ సంతోషం ఆవిరి అయిపోయింది. దీంతో పురావస్తు శాఖ నిర్వహణ పై విమర్శలు వెలువెత్తుతున్నాయి. గార్డెన్ లో ఉన్నటువంటి గడ్డి ఏపుగా పెరుగుతుండటంతో కనీస పర్యవేక్షణ కరువైందని పర్యాటకులు భక్తులు విమర్శలు చేస్తున్నారు. సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని భక్తులు, పర్యాటకులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

## ఎన్ ఎస్ యు ఐ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా రాకేష్ ముదిరాజ్ నియామకం



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 10 (క్రైమ్ మిర్రర్) :** విద్యార్థుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న రాకేష్ ముదిరాజ్‌ను ఎన్ ఎస్ యు ఐ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా రాకేష్ ముదిరాజ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎన్ ఎస్ యు ఐ జాతీయ అధ్యక్షులు వినోద్ కి, తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షులు వెంకటస్వామి కి, జాతీయ లీగల్ సెల్ కన్వీనర్ అక్బర్ కి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో ఎన్ ఎస్ యు ఐ ని మరింత బలోపేతం చేస్తానని రాకేష్ ముదిరాజ్ తెలిపారు.

## ఉత్తమ ప్రధానోపాధ్యాయులకు ఘన సన్మానం



**కోదాడ సెప్టెంబర్ 10 (క్రైమ్ మిర్రర్):** కోదాడ మండల పరిధిలోని గుడిబండ గ్రామ పంచాయతీలో సర్పంచ్ మందుల నాగయ్య అధ్యక్షతన రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా ఎంపికైన ఎండీ సలీం, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలిగా ఎంపికైన విమలా కుమారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుమాటి వరప్రసాద్ రెడ్డి, ఇర్లా నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మందుల నాగయ్య, గ్రామ పెద్దలు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. ఎండీ సలీం మాట్లాడుతూ పేద విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందేలా తన వంతు సహకారం అందిస్తానని, గుడిబండ విద్యా అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## క్రిష్ణగిరి పాదాల గుట్ట శ్రీ రాధాక్రిష్ణ ఆలయ క్షేత్రం

### కర్త కర్మ క్రియ నరేష్ కుమార్ కు ఐదు వేల విరాళం.

### రిటైర్డ్ టీచర్ నర్సింహారెడ్డి ని అభినందించిన సేవా ఫౌండేషన్.


**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** సనాతన ఆలయాల అభివృద్ధికి అలుపెరుగని మహా యజ్ఞం చేస్తున్న నరేష్ కుమార్ దేశ సేవ, దైవ సేవకు ముగ్దుడైన రిటైర్డ్ టీచర్ నర్సింహారెడ్డి శుక్రవారం సాయంత్రం తన వంతు సహాయంగా రూపాయలు ఐదు వేలను శంకర్ పల్లి లోని నరేష్ కుమార్ కు చెందిన పాల షాపులో అంధచేయడం జరిగింది. ఈ సందర్భంగా టీచర్ దండు నర్సింహా రెడ్డి మాట్లాడుతూ నరేష్ కుమార్ చిన్నప్పటి నుండి సేవా ధృక్పథం కల వ్యక్తి అని, ఎన్కతల శనీశ్వరుని గుడికి, మాంధాపురం లోని గుడికి ప్రచారం చేస్తూ, చందిప్ప మరకత శివలింగ నామ కరణ, పునరుద్దరణ భక్తునిగా కోటి దీపోత్స రాష్ట్ర స్థాయ ఆవార్డును అందుకున్నారని కొనియాడారు. నరేష్ సేవలను చూసి ఇటీవల భాజాపా ఎండోమెంట్ సెల్ ధార్మిక సంస్థ కన్వీనర్ అన్నా వజ్జుల సూర్య ప్రాకాశ్ రావు, కో కన్వీనర్ నిరంజన్ దేశాయిలు నరేష్ కుమార్ కు రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్ గా పదవిని ఇవ్వడం సంస్థకే గర్వ కారణం అన్నారు. పదేండ్ల కృషితో చందిప్ప మరకత శివాలయాన్ని అభివృద్ధి చేసిన నరేష్ పుణ్యమా అని సుమారు 50 కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుందని, ఇది కారణ జన్మకే లభింస్తుందని అన్నారు. అనంతరం నరేష్ కుమార్ మాట్లాడుతూ సత్యమే జయతే అన్నట్లు ధర్మం కోసం పని చేస్తే ఇలాంటి అభివృద్ధికి ఎంతో మంది ముందుకు వస్తారని నేను చేస్తున్న సేవలకు నా కుటుంబం, నా మిత్రులు అండగా ఉన్నారని, ఈ కార్యక్రమంలో బుల్కాపూర్ కాళికామాత గుడి పూజారి రాంచందర్, పాల షాపు యజమాని పండరి నాథ్, స్వర్గీయ వెంకట్ రావు కుమారుడు బాబు, మురళీ క్రిష్ణ, మధు, నోముల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## రావిర్యాల హరిజన బస్తీలో చోరీ కలకలం.... తుపాకులతో దొంగల హల్‌చల్..!

### మహిళ మెడలో 7 మసాలా బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగులు..

### నాలుగు ఇళ్లల్లో చోరీకి పాల్పడిన దొంగలు భయాందోళనలో బస్తీవాసులు






**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో దొంగతనాలు కలకలం రేపుతున్నాయి..మంగళవారం అర్ధరాత్రి హరిజన బస్తీలోకి నలుగురు దొంగల ముఠా తుపాకులతో ప్రవేశించి చోరీకి పాల్పడింది. ఎవరూ లేని ఇళ్ల తాళాలు పగలగొట్టి దోచుకున్నారని బాధితులు తెలిపారు. ఓ ఇంట్లో నిద్రిస్తున్న మహిళ మద్దని లక్ష్మి ,స్వగ్రామం: వెన్నచెర్ల, మండలం: పెద్దకొత్తపల్లి, జిల్లా: నాగర్ కర్నూల్,వాసి మెడలోని 7 మసాలా బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె గత 10 సంవత్సరాలుగా ఇక్కడే రోజువారీ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తోంది. దీంతో బస్తీవాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. తాము పొట్టకూటి కోసం గ్రామాలను వదిలి వచ్చిన పేద కూలీలమని, తమకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. బస్తీలో ప్రతిరోజూ పోలీసు పెట్రోలింగ్ నిర్వహించాలని, దొంగలను వెంటనే పట్టుకోవాలని, వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను కోరారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595

# వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళి

### మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్

**వనపర్తి సెప్టెంబర్ 10 క్రైమ్ మిర్రర్:** తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ఘనంగా నివాళు లర్పించారు. గురువారం పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో చాకలి ఐలమ్మ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ. తెలంగాణ మట్టి ఆత్మగౌరవాన్ని, పేదల భూమి హక్కులను కాపాడేందుకు భూస్వాములపై ఎదురొడ్డి నిలిచిన వీరమాత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. రజాకార్లు, దొరల అరాచకాలపై రోకలి బండ చేత పట్టుకుని పోరాడిన ఆమె ధీరత్వం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఐలమ్మ చూపిన పోరాట బాట సమాజంలో హక్కుల సాధనకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కొంతం దయాకర్ రెడ్డి,జగదీశ్వర్ రెడ్డి, షకీల్,యుగేందర్ రెడ్డి,రజక నరసింహ,పెద్ద రాములు, సునీల్ రెడ్డి,రజక సంఘం సభ్యులు సూరయ్య,జయన్న,ఆర్. రాముడు,యం.దస్తగిరి,బాలయ్య,ఇ. సురేష్,పారిజాత,చంద్ర శేఖర్ పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మ సేవలను స్మరించుకున్నారు.



# వార్డు కార్యాలయంలో సొంత నిధులతో ఫ్యాన్లను ఏర్పాటు చేయించిన మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్





**కూకట్ పల్లి, సెప్టెంబర్ 10 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, మూసాపేట్ వార్డు కార్యాలయంలో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ (ఎస్ ఆర్ ఐ) ప్రక్రియను మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ పరిశీలన కోసం వెళ్లిన తరుణంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారుల (బి ఎల్ ఓ) దుస్థితిని చూసి ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయంలో ఫ్యాన్లు పనిచేయకపోవడం, ఉదయం నుండి సాయంత్రం వరకు విధులు నిర్వర్తించే బి ఎల్ ఓ లు కూర్చొని పని చేయడానికి సరిపడా కుర్చీలు, టేబుళ్లు, కనీసం త్రాగునీరు కూడా అందుబాటులో లేకపోవడాన్ని ఆయన స్వయంగా గుర్తించి చలించిపోయారు. అధికారులు పడుతున్న ఇబ్బందులపై తక్షణమే స్పందించిన తూము శ్రావణ్ కుమార్ బి ఎల్ ఓ ల కొరకు కుర్చీలు, టేబుళ్లను తక్షణమే ఏర్పాటు చేయించారు. మంచి నీటి సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేయించారు. అంతేకాకుండా, వెంటనే తన సొంత ఖర్చుతో కొత్త ఫ్యాన్లు కొనుగోలు చేసి వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తుకారాం, ఒగ్గు లింగం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## అనధికార నిర్మాణాలపై సీఎంసీ కొరడా...

### ఒక్కరోజే 17 కూల్చివేతలు.....

క్రైమ్ మిర్రర్ సైబరాబాద్ : అనధికార నిర్మాణాలపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను ముమ్మరం చేసింది. భవన నిర్మాణ నిబంధనల అమలులో భాగంగా మూడు జోన్ల పరిధిలో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహిస్తోంది. గురువారం చేపట్టిన తనిఖీల్లో 15 అనధికార నిర్మాణాలను గుర్తించగా, 17 నిర్మాణాలను కూల్చివేశారు. మరో 9 నిర్మాణాలకు నోటీసులు జారీ చేశారు.

**జోన్ల వారీగా కూల్చివేతల వివరాలు:** శేరిలింగంపల్లి జోన్ లో 5,కూకట్‌పల్లి జోన్ లో 4, కుత్బుల్లాపూర్ జోన్ లో 8. అనధికార నిర్మాణాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రతి కేసులో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనుమతి లేని నిర్మాణాలపై సీఎంసీ తనిఖీలు, కూల్చివేతలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## అణగారిన వర్గాల పాలన రావడం కోసం డప్పులు కొడదాం

### తెలంగాణలో బీఎస్పీ పాలన కోసం పోరాడుదాం

### బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** సమాజంలో అన్ని వర్గాలకు సమాన అవకాశాలు దక్కినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం ఏర్పడుతుందని, డప్పు దరువు అనేది ఒక చైతన్య వేదిక అని అటువంటి డప్పు దరువు అణగారిన వర్గాల పాలన కోసం ప్రయత్నించాలని బిఎస్పి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ తెలిపారు. డప్పులు ఆయన పాలన పోవడానికి, వీళ్ళ పాలన రావడానికి కాకుండా అణగారిన వర్గాల పాలన రావడానికే కొడితే బాగుంటదని, ఇంకెన్ని రోజులు మనం ఆయన పాలన పోవాలని, వీళ్ళ పాలన రావాలని డప్పులు కొడతామని, మన అణగారిన వర్గాల పాలన తేవడానికి డప్పులు కొడితే పిల్లల భవిష్యత్తు బాగుంటదని, వాళ్ల పాలన తెచ్చినా మనం డప్పులే కొడుతున్నాం. వాళ్లనువొడగొట్టి వీళ్ల పాలన తెచ్చినా డప్పులే కొడుతున్నామని, మన డప్పులు మన పాలన తేవడానికి కొడితే మన పిల్లలు అభివృద్ధి చెందుతారు. యుపిలో మాయావతి మన పాలన రావడానికి మన వాళ్ళతో డప్పులు (ఓట్లు) కొట్టించారు. 2027లో కూడా కొట్టిస్తారు. 2028లో తెలంగాణలో మనం కొట్టిద్దాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం వల్ల వెలమలు పాలకులు అయ్యిర్రు, వెలమలను తీసేసి రెడ్డిలు పాలకులుగా కొనసాగుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో, తెలంగాణలో మళ్లీ మనం పాలితులుగానే కొనసాగుతున్నాం. కాబట్టి మనం పాలకులు కావడానికి డప్పులు కొడితే బాగుంటదని, కాంగ్రెస్ బిఆర్ఎస్ ల కోసం కాకుండా అణగారిన వర్గాలకు అధికారం రావాలని బి.ఎస్.పి కి అందరం జై కొట్టాలని ఇబ్రాం శేఖర్ తెలిపారు.

## చాకలి ఐలమ్మకు ఘన నివాళులు



**చిట్యాల క్రైమ్ మిర్రర్ :** చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో రజక సంఘం అధ్యక్షుడు గోలి కిష్టయ్య ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకొని ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొంతల చంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అంతటి నరసింహ, రజక సంఘం ప్రధాన కార్యదర్శి గుండెపూరి చంద్రయ్య, ఉపాధ్యక్షులు గోలి నరసింహ, వార్డు సభ్యులు చిరుగోని శ్రీశైలం, లోడే చిరంజీవి, ఏనుగు శ్రీకాంత్ రెడ్డి, దేశబోయిన మంజుల మల్లేష్, చింతకింది వెంకటేష్, మహంకాళి కుమారస్వామి, గ్రామ నాయకులు చీమల వీరేశం, వెల్ది రాఘవరెడ్డి, ఏనుగు సుధాకర్ రెడ్డి, దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాతి శ్రీనివాస్, కాటం సత్తయ్య, సుర్కంటి మోహన్ రెడ్డి, ఆరూరి శ్రీనివాస్, దేశబోయిన నరసింహ, అంతటి రాజు, అంశాల శ్రవణ్ కుమార్, రజక సంఘం కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాములు, గోలి ఆంజనేయులు, రజక సంఘం నాయకులు గోలి శంకరయ్య, గోలి నరసింహ, గోలి అరవింద్ ,గోలి దుర్గయ్య, గోలి సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటు



### శుభాకాంక్షలు తెలిపిన పట్వారీ శశిధర్

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 10 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ "జయ శంకర్ కాలనీ ఫేస్2" లోని "జయశంకర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్" నూతన కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు, కాలనీవాసులు అందరూ కలిసి "ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్ ని కాలనీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్వారీ శశిధర్ జయశంకర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించి హృదయపూర్వకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కమిటీ సభ్యులంతా ఐకమత్యంగా ఉండాలని, ఎలాంటి అభిప్రాయ భేదాలకు లేకుండా కలిసి పనిచేయాలని, కాలనీలో ఎటువంటి సమస్యలు కలుగ కుండా చూసుకోవాలని కోరారు. నూతన కమిటీకి తన సంపూర్ణ సహకారం, మద్దతు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, "నూతన కమిటీ సభ్యులు, కాలనీ 'ప్రెసిడెంట్' కోమిరెడ్డి రాంరెడ్డి, 'జనరల్ సెక్రటరీ' కొండా రమేష్, 'వైస్ ప్రెసిడెంట్' ఆంబోతు దేవా నాయక్, మహమ్మద్ గఫూర్, 'క్యాషియర్' ఈశ్వర్, 'జనరల్ సెక్రటరీ' జక్కుల సురేష్, వి. శివశంకర్, కే.నరేష్, కాలనీవాసులు, మహిళలు, యువత, టీం పట్వారీ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన తండాల్లో మెరుగైన వైద్యం: అదనపు కలెక్టర్ చంద్రయ్య

### వెంకటాపూర్‌లో 'పీఎం జన్మన్' కేంద్రం పరిశీలన

### వారానికోసారి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలి




**మంచిర్యాల సెప్టెంబర్ 10(క్రైమ్ మిర్రర్):** మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రజలందరికీ మెరుగైన వైద్యం, ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని రకాల సంక్షేమ ఫలాలు త్వరితగతిన అందాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య సూచించారు. కాశీపేట మండలం వెంకటాపూర్ పీవీటీజీ (ఆదిమ గిరిజన) గ్రామంలో ఐటీడీఏ ఉట్నూర్, గిరిజన సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'పీఎం జన్మన్' కింద రూపుదిద్దుకున్న బహుళార్ధ సాధక (ఎంపీసీ) భవనాన్ని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకంలో భాగంగా గ్రామంలోనే సకల సౌకర్యాలు పొందేలా ఈ కేంద్రాన్ని సచివాలయం తరహాలో అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇక్కడే ప్రాథమిక పాఠశాల చిన్నారులకు బోధన సాగించేలా, వైద్య శిబిరాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆరోగ్య అంశాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేలా కరపత్రాలు, పోస్టర్లను ప్రదర్శించాలని స్పష్టం చేశారు.

**ప్రజా సమస్యలపై సుదీర్ఘ సమీక్ష...**

అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ, వ్యాధి నిరోధక టీకాలు, అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) పరీక్షల తీరుపై ఆరోగ్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇళ్లు, తాగునీరు, విద్యుత్, పింఛన్లు, రహదారులు తదితర అంశాలపై గ్రామస్థులతో నేరుగా మాట్లాడారు. పరిసరాల్లోని మూడు గ్రామాలను కలుపుకొని ప్రతి వారం వైద్యులు తప్పనిసరిగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించాలని ఆదేశించారు. మారుమూల గిరిజన ప్రాంతంలోనూ వైద్య సేవలు సజావుగా సాగుతుండటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంద్రం శంకర్, ఉపసర్పంచ్ ప్రసన్న, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీఓ సాజిద్ అలీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధాకర్ నాయక్, వైద్యాధికారి దివ్య, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, పుట్ట సత్తయ్య, పంచాయతీ కార్యదర్శి సునీత, పీఎం జన్మన్ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సుజాత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





## జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

**నిందితుడి వద్ద నుండి పల్సర్, స్ప్లెండర్, యాక్టివా ద్విచక్రవాహనాలు స్వాధీనం**

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 10 (క్రైమ్ మిర్రర్) : జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాసనగర్‌లో స్థానికంగా నివసించే ముక్కిడి బాలకృష్ణ అనే వ్యక్తి తరచుగా బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు జగద్గిరిగుట్ట పోలీసులు గుర్తించారు. ఇటీవల నమోదైన 3 ద్విచక్ర వాహనాల చోరీ కేసులకు సంబంధించి నిందితుడు ముక్కిడి బాలకృష్ణను గురువారం జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి విచారించగా మూడు ద్విచక్ర వాహనాలను దొంగిలించిన విషయం ఒప్పుకున్నాడు. అనంతరం పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. నిందితుడి వద్ద నుండి ఒక పల్సర్, ఒక స్ప్లెండర్, ఒక యాక్టివా మొత్తం 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులను ఛేదించిన జగద్గిరిగుట్ట క్రైమ్ టీమ్‌ను డీసీపీ కుత్బుల్లాపూర్, ఏసీపీ అభినందించారు.

## ఆర్యవైశ్య సంఘం ఎన్నికల ఫలితాలు కోదాడలో కాంగ్రెస్ పతనానికి నాంది

### మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



**కోదాడ సెప్టెంబర్ 10 ( క్రైమ్ మిర్రర్):** నిన్న జరిగిన ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో ఘన విజయం సాధించిన పైడిమర్రి నారాయణరావును కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో పైడిమర్రి నారాయణరావు సాధించిన విజయం కోదాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ, ఉత్తమ్ పద్మావతిల ఓటమికి పునాది వేసిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కోదాడ నియోజకవర్గంలో కొనసాగుతున్న అరాచక, అవినీతి పాలనకు వ్యతిరేకంగా వ్యాపార వర్గాలు ఇచ్చిన స్పష్టమైన తీర్పే ఈ విజయానికి నిదర్శనమని విమర్శించారు. ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో వ్యాపార వర్గాలు వెల్లడించిన ఈ తీర్పు, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి, ఉత్తమ్ పద్మావతికి ఎదురుకానున్న పరాభవానికి సంకేతమని ఆయన అన్నారు. ప్రజల్లో, ముఖ్యంగా వ్యాపార వర్గాల్లో ప్రభుత్వ పాలనపై వ్యతిరేకత పెరుగుతోందని పేర్కొన్నారు. కోదాడ నియోజకవర్గంలో ప్రజా సమస్యలు, వ్యాపార వర్గాల ఇబ్బందులు పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని బొల్లం మల్లయ్య యాదవ్ ఆరోపించారు. రాబోయే రోజుల్లో ప్రజల తీర్పు కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పే విధంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.


# పార్టీ పేరుతో మోసం చేస్తున్న కాంగ్రెస్ యువజన నాయకులు పి.ఆర్.నాయుడు

### న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేసిన బాధితులు

### అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న పి ఆర్ నాయుడు పై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తాం

### బాలాజీ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేష్ గౌడ్








**కూకట్ పల్లి, సెప్టెంబర్ 10 (క్రైమ్ మిర్రర్) :** ?కూకట్ పల్లి యూత్ కాంగ్రెస్ నాయకుడు తనకు పార్టీలోని పెద్దలతో మంచి పరిచయాలు ఉన్నాయని నమ్మిస్తూ, అమాయక ప్రజలను ఉద్యోగాలు, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పేరిట, స్థలాల వివాదాలు పరిష్కరిస్తానని మోసం చేస్తూ లక్షల రూపాయలను వసూలు చేస్తున్నాడని కెపిహెచ్ బి కాలనీలో పలువురు బాధితులు రోడ్డుకు ఎక్కిన విషయం గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంగా కేపీహెచ్ బి కాలనీలో బాధితుడు దాసరి దుర్గారావు మాట్లాడుతూ ఫైనాన్స్ కంపెనీ వ్యక్తి వద్ద తనకు రావలసిన 34 లక్షలు ఇప్పిస్తానని కెపిహెచ్ బి కాలనికి చెందిన ముత్తిరెడ్డి ఫణింద్ర (పి.ఆర్.నాయుడు) తనను నమ్మించి, ఫైనాన్స్ కంపెనీ వ్యక్తి తనకు ఇస్తానన్న స్థలాన్ని అక్రమంగా అతని పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడన్నారు. నాకు చెందాల్సిన స్థలం రిజిస్ట్రేషన్ చేయించుకున్నావని, తన రావలసిన డబ్బులు ఇవ్వమని అడిగితే బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. మరో బాధితుడు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నగర శివారులో తాను కొనుగోలు చేసిన స్థలం కబ్జాకు గురి కావడంతో సమస్యను పరిష్కరిస్తానని ముత్తిరెడ్డి ఫణింద్ర (పి.ఆర్.నాయుడు) అనే వ్యక్తి తన వద్ద రూ. 2 లక్షల రూపాయలను తీసుకున్నాడని ఆరోపించారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో డబ్బులు అడిగితే ఏం చేసుకుంటావో... చేసుకో అని బెదిరిస్తున్నాడన్నారు. ముత్తిరెడ్డి ఫణింద్ర అతని డ్రైవర్ రాము పేరుతో రూ. 90 వేలు విలువ చేసే ఐ ఫోన్ కొనుగోలు చేసి ఇఎంఐలు కట్టకుండా రామును ఇబ్బంది పెడుతున్నాడని తెలిపారు. బ్యాంక్ అధికారులు డ్రైవర్ రామును ఇఎంఐలు కట్టాలని ఇబ్బంది పెడుతున్నారన్నారు. మరో బాధితుడు మాట్లాడుతూ తనకు టీ పాయింట్ ఇప్పిస్తానని చెప్పి 35 వేల రూపాయలను తీసుకున్నాడని ఆరోపించారు. అనంతరం బాలాజీ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేష్ మాట్లాడుతూ పార్టీ పేరును అడ్డం పెట్టుకొని అమాయక ప్రజలను నమ్మిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న పి ఆర్ నాయుడు పై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామన్నారు. పి ఆర్ నాయుడు వల్ల మోసపోయిన బాధితులు చాలా మంది ఉన్నారని, ఈ విషయాలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామన్నారు.



## బోనాల ఉత్సవాల్లో మునుగోడు సర్పంచ్ రమాదేవి ఘన సన్మానం

### సొంత ఖర్చులతో ఆలయం మరమత్తులు,రంగులు వేయించిన సర్పంచ్

### బోనమెత్తిన చిన్నారులు



**మునుగోడు క్రైమ్ మిర్రర్ సెప్టెంబర్ 10 :** మునుగోడు మండల కేంద్రంలో ముత్యాలమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్నారు..గాంధీనగర్ 1వ వార్డులో సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ దంపతులు బోనాల ఉత్సవాల్లో పాల్గొనీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు పండాలని,గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరారు..బోనాల పండుగ సందర్భంగా సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ లు తమ సొంత ఖర్చులు 80 వేల రూపాయలతో ఎల్లమ్మ గుడి (ఆలయాన్ని) మరమత్తులు,ఆలయానికి రంగులు దిద్ది సుందరీకరణంగా చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సర్పంచ్ దంపతులను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.యూత్ ఆధ్వర్యములో సర్పంచ్ దంపతులను సన్మానించారు..వార్డు సభ్యులు పందుల నీత రాజేష్,మాజీ ప్రజాప్రతినిధులు ,యూత్,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

## పర్యావరణహిత గణేశ విగ్రహాలతో గణేశోత్సవ్ - సెలబ్రేట్ విత్ ఎ కాజ్

### సామాజిక బాధ్యతపై అవగాహనకు సీబీఐటీ శ్రీకారం



**గండిపేట(క్రైమ్‌మిర్రర్):** పర్యావరణ పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)కి చెందిన చైతన్య స్పందన ఆధ్వర్యంలో 'గణేశోత్సవ్ -- సెలబ్రేట్ విత్ ఎ కాజ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గణేశ్ చతుర్థి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూనే పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందిస్తున్నారు. కార్యక్రమాన్ని సీబీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ సి.వి. నరసింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగల నిర్వహణలో భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణ, సామా జిక బాధ్యతను కూడా గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చైతన్య స్పందన చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో భాగంగా 6, 8, 9, 10 అంగుళాల పరిమాణాల్లో పర్యావరణహిత గణేశ విగ్రహాలను అందుబాటులో ఉంచుతున్నారు. పర్యావరణానికి హాని కలిగించని విగ్రహాలను వినియోగించడం ద్వారా గణేశ్ ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించవచ్చునే అవగాహనను ప్రజల్లో కల్పిస్తున్నారు. సెలబ్రేట్ విత్ ఎ కాజ్ అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్తు నిర్మాణం, జంతు సంక్షేమం, అందరికీ వెచ్చదనం, సామాజిక మద్దతు వంటి పలు సామాజిక సేవా కార్యక్రమాలపై కూడా అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ అడ్వైజర్ డాక్టర్ ఎన్.ఎల్.ఎన్. రెడ్డి, డాక్టర్ జి.ఎన్.ఆర్. ప్రసాద్‌తో పాటు పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన గురుకులంలో వైరల్ ఫీవర్

### విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించిన మండల వైద్యాధికారి డాక్టర్ జోష్న





**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:-** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు వైరల్ ఫీవర్స్ బారిన పడ్డారు.పాఠశాలలో 8వ తరగతి చదువతున్న 15 మంది విద్యార్థులకు గత రెండు రోజులుగా జ్వరాలు పట్టడంతో తోటి విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. మరి కొంతమంది విద్యార్థులకు గజ్జి,తామర, జలుబు వంటి వ్యాధులు ఆవరించినట్లు తెలిసింది.జ్వరాల బారిన పడ్డ విద్యార్థులను పాఠశాల సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు.ఒకేసారి 15 మందికి గత రెండు రోజులుగా జ్వరాలు రావడంతో ప్రభుత్వ వైద్య ఆసుపత్రి డాక్టర్ జ్యోత్స్న సమక్షంలో సిబ్బంది ఆశ్రమ పాఠశాలలను సందర్శించి వైద్య సేవలు అందిస్తున్నారు.అవసరమున్న వారికి మందులను పంపిణీ చేశారు.జ్వరం బారిన పడ్డ విద్యార్థులతో పాటు పాఠశాల విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి వైరల్ ఫీవర్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ జోత్స్న సలహాలు సూచనలు ఇచ్చారు.కాచి చల్లార్చిన నీళ్లను తాగాలన్నారు. ఈగలు వాలిన ఆహారం తీసుకుంటే వాంతులు విరేచనాలు అవుతాయన్నారు.దోమల కుట్టకుండా జాగ్రత్త పడాలన్నారు.భూమిపై నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. మండలంలో ఉన్న వివిధ వసతి గృహాల విద్యార్థులను వారానికోసారి సందర్శించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవసరం ఉన్నవారికి మందులను అందజేస్తున్నామన్నారు.



## సిరిసంపదలు, పాడిపంటల కోసం మహాలక్ష్మి మహాయాగం

**కోదాడ సెప్టెంబర్ 10 ( క్రైమ్ మిర్రర్):** కోదాడ: స్వస్థ శ్రీ పరాభనామ సంవత్సర శ్రావణమాస అమావాస్య గురువారం పట్టణములోని స్థానిక శ్రీనివాసనం వెంచర్ నందు శ్రీ శక్తి జ్యోతిష్య నిలయం చఆధ్వర్యంలో సుదర్శన లక్ష్మీ నృసింహ మహాయాగం భక్తిశ్రద్ధలతో వేద పండితుల మంత్రాలతో కన్నుల పండుగగా వైభవోపేతంగా నిర్వహించారు వేద పండితులు గోపూజ ఆరాధన పుణ్య హవాచనం దీక్ష ధారణ అగ్ని ప్రతిష్టాపన లక్ష్మీ గణపతి లక్ష్మీ కుబేర సుదర్శన నరసింహ అష్టోత్తర శతపద్మాలతో శ్రీ మహాలక్ష్మి యాగాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా వేద పండితులు మాట్లాడుతూ ఈ సుదర్శన నరసింహ సాహితీ శ్రీ మహాలక్ష్మీ యాగం కోదాడ ప్రాంత ప్రజలు సుభిక్షంగా ఉండాలని వర్షాలు మెండుగా కురిచి పాడిపంటలతో రైతులు ఆయురారోగ్యాలతో సిరిసంపదలతో వర్ధిల్లాలని ఈ యాగం నిర్వహించినట్లు చెప్పారు ఈ యాగం లో శ్రీనివాస వెంచర్నిర్వాహకులు మేళ్లచెరువు కోటేశ్వరరావు దంపతులు వేద పండితులు కాందూరి,వంశీకృష్ణ మాచార్యులు,తిరుపతి సుబ్రహ్మణ్య శర్మ, దివి సందీప్ చార్యులు,దాత కోదాడ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పైడిమర్రి నారాయణరావు సహకారంతో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు కార్యక్రమంలో మేళ్లచెరువు కమల్, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి ఉంటుంది



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) జిహెచ్ఎంసి బడంగ్పేట్ సర్కిల్ అల్మాస్ గూడలోని హైమాత టెంపుల్ నుంచి కోమటికుంట చెరువు వరకు 30 లక్షల వ్యయంతో బిటీ రోడ్డు అభివృద్ధి పనులకు జరిగిన కార్యక్రమంలో ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోయపల్లి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ రహదారి అభివృద్ధికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతు, ప్రజల సమస్యలను గుర్తించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే తన బాధ్యత అని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, అదే విధంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ రహదారి సమస్యను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతుంటే, తమ సొంత నిధులతో చేసినట్లుగానో, బీఆర్ఎస్ నిధులతో చేపట్టినట్లుగానో ఈ అభివృద్ధి పనులను ప్రజలకు చెప్పడం సరికాదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంజూరైన నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులకు తాము చేసినట్లుగా ప్రచారం చేసుకోవడం తగదని, శంకుస్థాపన చేయడం మాత్రమే అభివృద్ధి కాదని, ప్రజల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి పనులను పూర్తి చేయడమే నిజమైన అభివృద్ధి అని బోయపల్లి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నవారు మల్లారెడ్డి, దిండు శ్రీనివాస్ గౌడ్, విశాఖ నగర్ కాలనీ ప్రెసిడెంట్ బొజ్జ రవీందర్ రెడ్డి, రవి నాయక్, జైపాల్ నాయక్, సిద్దారెడ్డి, యాదగిరి, వేమిరెడ్డి, ప్రవీణ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం తాళ్లవెల్లంల గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి రజక సంఘ సభ్యులు నివాళులార్పించారు.నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి మహిళా శక్తికి ప్రతికగా నిలిచిన ఐలమ్మ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదయాకమని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో రజక సంఘ నాయకులు కొమ్మనపల్లి యాదయ్య, యాదయ్య, స్వామి, గోపాల్, శ్రీను, జిల్లపల్లి స్వామి, శ్రీను, సత్తయ్య, కొమ్మనపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు



# రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం రైతులకు అన్యాయం చేస్తున్నారంటూ రైతుల ఆందోళన

## రేడియల్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని సంకేపల్లిగూడ రైతుల ధర్నా





**క్రైమ్ మిర్రర్ షాబాద్ సెప్టెంబర్ 10:** రేడియల్ రోడ్డు నిర్మాణంలో భూసేకరణ అలైన్‌మెంట్ తమకు తీవ్ర అన్యాయం చేసే విధంగా ఉందంటూ రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సంకేపల్లిగూడ గ్రామానికి చెందిన రైతులు ఆందోళనకు దిగారు. ముంబై--బెంగళూరు లింకు జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. రేడియల్ రోడ్డు రింగ్ నిర్మాణం కోసం తమ గ్రామానికి చెందిన భూములు పెద్ద మొత్తంలో కోల్పోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రేడియల్ రోడ్డుకు ఇరువైపులా సమానంగా 50--50 నిష్పత్తిలో భూములు సేకరించే విధంగా అలైన్‌మెంట్ రూపొందిస్తే తాము అంగీకరిస్తామని తెలిపారు. అయితే ప్రస్తుత అలైన్‌మెంట్‌లో సంకేపల్లిగూడ గ్రామ రైతుల భూములు దాదాపు పూర్తిగా రోడ్డు పరిధిలోకి వస్తున్నాయని ఆరోపించారు.రేడియల్ రోడ్డు అవతలి వైపు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సంబంధించిన భూములు ఉండటంతో, వారి ప్రయోజనాలను కాపాడేందుకు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి తమ భూములు కోల్పోయే విధంగా అలైన్‌మెంట్ రూపొందించారని రైతులు ఆరోపించారు. ఈ ఆరోపణలపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని వారు డిమాండ్ చేశారు.అలైన్‌మెంట్‌ను పునఃపరిశీలించి, అన్ని ప్రాంతాల్లో రైతులకు సమానంగా భూసేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రేడియల్ రోడ్డు రింగ్ భూసేకరణ విషయంలో న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.తమ డిమాండ్లను పరిష్కరించకపోతే నిరాహార దీక్షలకు దిగుతామని, అవసరమైతే ప్రాణత్యాగానికైనా వెనుకాడబోమని రైతులు హెచ్చరించారు. సంకేపల్లిగూడ రైతుల ఆందోళనకు రుద్రారం సర్పంచ్ యాదిరెడ్డి మద్దతు ప్రకటించి ధర్నాలో పాల్గొన్నారు. రైతులతో కలిసి ఆయన ఆందోళనలో కూర్చున్నారు.రైతుల ధర్నాతో ముంబై--బెంగళూరు లింకు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి, కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రారం సర్పంచ్ గొల్లగూడెం యాదిరెడ్డి, సంకేపల్లి గూడ గ్రామ సర్పంచ్ మరియు ఇతర రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన దైద రవీందర్

**రామన్నపేట క్రైమ్ మిర్రర్:** రామన్నపేట మండలం దుబ్బాక గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ గుండాల నర్సింహ సతీమణి గుండాల లావణ్య మృతి చెందగా, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.ఈ కార్యక్రమంలో దుబ్బాక కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గుండాల నర్సింహ, సతీష్, యాదయ్య, రమేష్, అశోక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గట్టు నరేందర్, ఉపసర్పంచ్ గుండాల రమేష్, వార్డు సభ్యుడు మేడి సంతోష్, పుట్టల స్వామి, మహేష్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గురజాల మహేష్ రెడ్డి, గుండాల కిరణ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నోముల చిరంజీవి, గుండూరి శంకర్, జితేందర్, సాగర్, నవీన్, శివ, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా ఇన్వెస్టిచర్ సెర్మనీ కార్యక్రమం



**మందమర్రి టౌన్ సెప్టెంబర్ 10 క్రైమ్ మిర్రర్:** మందమర్రి పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇన్వెస్టిచర్ సెర్మనీ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాయిలింగు హాజరై విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విద్యార్థి ఎన్నికల్లో ఎన్నికైన ప్రతినిధులకు బ్యాడ్జీలు, శాలువాలు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావన, క్రమశిక్షణ, కర్తవ్య నిర్వహణను పెంపొందించడమే ఇన్వెస్టిచర్ సెర్మనీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో సమాజానికి ఆదర్శవంతమైన నాయకులుగా ఎదగాలంటే చిన్నప్పటి నుంచే నాయకత్వ నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్. రమేష్ మాస్టర్ సేవలను ప్రశంసిస్తూ అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. రమేష్, డీన్ కె. రవితేజ, ప్రైమరీ ఇంచార్జ్ సునీత, పీపీటీ ఇంచార్జ్ తిరుమల, జోనల్ ఇంచార్జ్ రాజేందర్ పాల్గొన్నారు. పాఠశాల ఛైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి, జోనల్ ఏజీఎం అరవిందర్ రెడ్డి, కోఆర్డి

## ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లా ఆనంద్



**గండిపేట(క్రైమ్‌మిర్రర్):** విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాడుతూ, విద్యార్థుల హక్కుల కోసం ముందుండి ఉద్యమిస్తున్న యువ నాయకుడు జిల్లా ఆనంద్‌కు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు దక్కాయి. జిల్లా ఆనంద్‌ను ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. ఆనంద్ నియామకంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్ఎస్‌యూఐ శ్రేణుల్లో, విద్యార్థి వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వారి హక్కుల కోసం చురుకుగా పనిచేస్తున్న నాయకుడికి ఈ పదవి దక్కడం పట్ల పలువురు విద్యార్థి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా ఆనంద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ స్వామి, అక్బర్, రాజ్యసభ సభ్యులు అనిల్ యాదవ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తన రాజకీయ ప్రస్థానంలో ఎల్లప్పుడూ తనకు అండగా నిలిచి ప్రోత్సహిస్తున్న స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు లభించిన పదవి కేవలం హోదా కాదని, విద్యార్థుల కోసం మరింత బాధ్యతగా పనిచేసే అవకాశం అని ఆనంద్ పేర్కొన్నారు. ఫీజుల పెంపు, స్కాలర్‌షిప్‌ల సమస్యలు, హాస్టళ్లలో వసతుల కొరత, విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఉద్యోగ నోటిఫికేషన్లు తదితర అంశాలపై విద్యార్థుల తరఫున తన గొంతు వినిపిస్తానని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ఎస్‌యూఐని మరింత బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని జిల్లా ఆనంద్ అన్నారు. ప్రతి కళాశాలలో విద్యార్థుల సమస్యలపై స్పందించే బలమైన నాయకత్వాన్ని నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి విద్యార్థులను నేరుగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకుంటానని చెప్పారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మరింత బలమైన ఉద్యమాలను చేపడతామని జిల్లా ఆనంద్ స్పష్టం చేశారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా రమాదేవికి ఘన సన్మానం



**గండిపేట(క్రైమ్‌మిర్రర్):** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని ఎంపీపీఎస్ గణేష్‌నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమాదేవికి శాలువా కప్పి, పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో రమాదేవి చేస్తున్న కృషి అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఆమె సేవలకు గుర్తింపుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు దక్కడం పాఠశాలకు, ఉపాధ్యాయులకు గర్వకారణమని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధా, కౌండిన్య, రాజశేఖర్‌గౌడ్, రోహిణి, సరోజ, సంతోష్, శరత్‌బాబుతో పాటు ప్రీ-ప్రైమరీ ఉపాధ్యాయులు మహేశ్వరి, మీనాక్షి పాల్గొని రమాదేవికి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఆమె మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

**తెలంగాణ రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షుడు : కునుకుర్తి అశోక్**



**క్రైమ్ మిర్రర్ చేవెళ్ల సెప్టెంబర్ 10:** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను ప్రపంచానికి చాటిన వీరవనిత చాకలి ఐలమ్మ అని తెలంగాణ రాజ్యాధికార పార్టీ చేవెళ్ల మండల అధ్యక్షుడు కునుకుర్తి అశోక్ అన్నారు.చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా చేవెళ్లలోని ఆమె విగ్రహానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కునుకుర్తి అశోక్ మాట్లాడుతూ.. నాటి సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ ధైర్యంగా పోరాడారని గుర్తుచేశారు.భూస్వామ్య వ్యవస్థకు, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. తన భూమిని కాపాడుకోవడంతో పాటు పేదలు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.సమాజంలో అణగారిన వర్గాలకు న్యాయం జరిగే వరకు వారి హక్కుల కోసం పోరాటం కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. ఐలమ్మ ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.

## ఉద్యోగి అధికారి అనే తేడా లేకుండా క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి:కేకేఓసి మేనేజర్ మధుసూదన్



**మందమర్రి టౌన్ సెప్టెంబర్ 10 క్రైమ్ మిర్రర్:** సింగరేణి సమస్త అభివృద్ధి నీ దృష్టిలో పెట్టుకొని ప్రతి ఉద్యోగి అధికారి అనే తేడా లేకుండా క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ప్రమాద రహిత ఉత్పత్తి లక్ష్యంగా పనిచేయాలని కేకే ఓసి మేనేజర్ మధుసూదన్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు అధికారులు రక్షణ సూత్రాలను పాటించకపోవడం విధులు నిర్లక్ష్యంగా నిర్వహించడం వల్లనే ప్రమాదాలు సంభవిస్తాయని అన్నారు. విధులలో చిన్న చిన్న పొరపాట్లే ప్రమాదాలకు కారణం అవుతాయని పని స్థలాలలో పక్క పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. కేకే ఓసి లో అధికారులు ఉద్యోగులు అనే తేడా లేకుండా కలిసికట్టుగా పనిచేస్తే సత్ఫలితాలు సాధించవచ్చు అని అన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఓసికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం కంటే అదనపు ఉత్పత్తిని సాధించి సింగరేణిలోనే సరికొత్త రికార్డు నెలకొల్పాలన్నారు. ఇతర ఓసీల ఉద్యోగులకు కేకే ఓసి ఉద్యోగులు ఆదర్శంగా నిలవాలని అంతేకాకుండా బొగ్గు నాణ్యత ప్రమాణాలను తప్పక పాటించాలని అన్నారు. మార్కెట్లో మన బొగ్గుకు మంచి రేటు లభిస్తుందని తెలిపారు. ఓసీలలో ఏమైనా సమస్యలు ఉంటే వాటిని నా దృష్టికి తీసుకురావాలని అవి నా పరిధిలో అయితే వెంటనే పరిష్కరిస్తానని కానట్లయితే పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చొర చూపుతానని అన్నారు. ప్రతి ఒక్కరు సమస్త మనది అనే భావనతోనే పనిచేస్తే అభివృద్ధిలో అగ్రగామిగా ఉంటామని పేర్కొన్నారు. అనంతరం కేకేఓసి ఉద్యోగులు ఐఎన్టియుసి ఆధ్వర్యంలో మేనేజర్ కు పుష్పగుచ్చం అందజేసి సాల్వతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్నకొండ ఆంజనేయులు ఫిట్ కార్యదర్శి నూనె సాంబయ్య తదితరులు పాల్గొన్నారు

## అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

**టిఆర్ఎస్వి మునుగోడు అధ్యక్షులు నలపరాజు రమేష్**

**బిఆర్ఎస్ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు నర్రి నర్సింహ**

**క్రైమ్ మిర్రర్ సంస్థాన్ నారాయణపురం:-** సీఎం ఇల్లు ముట్టడిస్తారేమోనన్న భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం టిఆర్ఎస్వి మునుగోడు అధ్యక్షులు నలపరాజు రమేష్ ని రాత్రి 12 గంటలకు అక్రమంగా అరెస్ట్ చేసి నారాయణపురం పోలీస్ స్టేషన్ కు తరలించారు. అలాగే నారాయణపురం మండల బిఆర్ఎస్ అధ్యక్షులు నర్రి నర్సింహ ని అరెస్ట్ చేశారునలపరాజు రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులా? ఇదేనా ప్రజా పాలన?కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి.. యువ వికాసం కింద ఇస్తామన్న 5 లక్షల విద్యా భరోసా కార్డు ఎక్కడ? 2 లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్ ఏది? నిరుద్యోగ భృతి రూ.4000 ఏది?విద్యార్థినులకు ఇస్తామన్న స్కూటీలు ఏమయ్యాయి?అన్ని యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న లెక్చరర్ల పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తారు?విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతున్న టిఆర్ఎస్వి గొంతును అక్రమ అరెస్టులతో నొక్కలేరు.



## గణేష్ మండపాల నిర్వహణపై రాజేంద్రనగర్ పోలీసుల సమన్వయ సమావేశం



గండిపేట(క్రైమ్‌మిర్రర్): గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజేంద్రనగర్ పోలీసుల ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డెయిరీ ఫామ్, పిల్లర్ నంబర్ 215 సమీపంలోని ఐబీ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ టీ. శ్రీనివాస్, రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఆర్. వెంకటేష్‌తో పాటు పలువురు సబ్‌ఇన్‌స్పెక్టర్లు హాజరయ్యారు. గణేష్ మండపాల నిర్వాహకులతో సమన్వయం, ఉత్సవాల సమయంలో భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులు చర్చించినట్లు సమాచారం. గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగేలా పోలీసు శాఖ, మండపాల నిర్వాహకులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించినట్లు తెలిసింది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రత, ట్రాఫిక్, శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరిస్తూ నిబంధనలు పాటించాలని, ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా నిర్వహించాలని అధికారులు సూచించారు.

# ఘనంగా వీర వనిత చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరవనిత చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతిని కుల్కచర్ల మండల రజక సంఘం అధ్యక్షులు టి రాములు ప్రధాన కార్యదర్శి మోత్కూర్ వెంకటేష్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుల్కచర్ల పిఏసిఎస్ చైర్మన్ బొలుసని భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ గ్రామ సర్పంచ్ వారువాళ్ళ అంజిలయ్య హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ పౌరుషానికి ప్రతీక వీరనారి చాకలి ఐలమ్మ ఆదిపత్యానికి అహంకార దూరనులకు వ్యతిరేకంగా పేద బడుగు బలహీన వర్గాల అణగారిన వర్గాల హక్కులకై పోరాడే తెలంగాణ తెగును పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకనిక చాకలి ఐలమ్మ అని అన్నారు. అలాగే చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్టాపన కోసం ఏర్పాటు చేసిన



స్థలం వద్ద పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దిశా కమిటీ మెంబర్ డాక్టర్ జానకిరామ్ చవాన్, మాజీ సర్పంచి జోగు వెంకటయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, బిజెపి మండల అధ్యక్షులు గుడాల వెంకటేష్, బిజెపి పార్టీ జిల్లా నాయకులు గాదె మైపాల్, పాల రాఘవేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంజనేయ గౌడ్ జలీల్, సొసైటీ డైరెక్టర్ ఆనందం, ఎల్లయ్య భరత్ రెడ్డి, కృష్ణయ్య ఉపసర్పంచ్ మాలే విజయ్ కుమార్, వార్డ్ మెంబర్ వినోద్ కుమార్ లాలు, సోషల్ మీడియా కన్వీనర్ కొమ్ము శ్రీనివాస్ గాదె వెంకటేష్ రజక సంఘం నాయకులు లక్ష్మయ్య వెంకటయ్య గోపాల భీమయ్య రాజు గోపి కృష్ణయ్య అంజిలయ్య బాలు తిరుపతి వెంకటేష్ పాల్గొన్నారు.



## పాఠశాల పారిశుద్ధ్య పనులకు సొంత డబ్బుతో సాయం

### మణికొండ ఎంపీపీ పాఠశాలలో రామకృష్ణరెడ్డి సేవాభావం

### నెలకు రూ.6 వేల చెల్లింపుపై అభినందనలు

**గండిపేట(క్రైమ్‌మిర్రర్):** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు మణికొండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మాజీ కౌన్సిలర్ రామకృష్ణరెడ్డి తన సేవాభావాన్ని చాటుకుంటున్నారు. పాఠశాలలో వాచ్‌మన్ అదనంగా పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నందుకు తన సొంత డబ్బు నుంచి ప్రతి నెలా రూ.6 వేల చెల్లిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగాల్సిన అవసరం ఉండటంతో, అదనపు సిబ్బంది సేవలను వినియోగించుకునేందుకు రామకృష్ణరెడ్డి స్వయంగా ముందుకు వచ్చినట్లు సమాచారం. ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా తన సొంత నిధులతో ప్రతి నెలా ఈ మొత్తాన్ని చెల్లించడం పట్ల స్థానికులు, పాఠశాల వర్గాలు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన తరగతి గదులు, ఆవరణ, మరుగుదొడ్లు అందుబాటులో ఉండటం వారి ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని, ఈ విషయంలో రామకృష్ణరెడ్డి తీసుకున్న చొరవ ప్రశంసనీయమని పలువురు పేర్కొన్నారు. సామాజిక బాధ్యతతో పాఠశాల అవసరాలకు తన వంతు సహాయం అందిస్తున్న రామకృష్ణరెడ్డిని పలువురు అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజలు, దాతలు ఇలాంటి సేవాభావంతో ముందుకు రావాలని ఆకాంక్షించారు.

# కొండల్‌రెడ్డి కంపెనీకి భూమి కేటాయింపుపై కేటీఆర్ బృందం పరిశీలన

### కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతల తీవ్ర ఆరోపణలు

### రాజేంద్రనగర్ నుంచి భారీగా తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

గండిపేట(క్రైమ్‌మిర్రర్): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫోర్త్ సిటీ పరిధిలో భూముల కేటాయింపులపై బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు రాజకీయంగా వేడెక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం గురువారం రంగారెడ్డి జిల్లాలోని కొంగర, రావిర్యాల ప్రాంతాల్లో పర్యటించింది. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్‌ను నిరసిస్తూ ప్రజాక్షేత్రంలోనే ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ నేతలు.. ప్రత్యేక సమావేశం అనంతరం కొంగర, రావిర్యాల ప్రాంతాల్లో టెస్సెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ కంపెనీకి కేటాయించినట్లు పేర్కొంటున్న భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్ పిలుపు మేరకు రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.




నియోజకవర్గంలోని పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఈ పర్యటనలో పాల్గొని ప్రభుత్వ భూముల కేటాయింపుపై బీఆర్ఎస్ నేతలకు మద్దతు తెలిపారు. టెస్సెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి సుమారు ఐదు ఎకరాల భూమిని కేటాయించడంలో భారీ అక్రమాలు జరిగాయని కేటీఆర్ ఆరోపించారు. మార్కెట్ విలువ సుమారు రూ.200 కోట్లుగా ఉన్న భూమిని కేవలం రూ.7 కోట్లకే కేటాయించారని ఆయన విమర్శించారు. ఈ భూమి కేటాయింపు వ్యవహారంపై ప్రభుత్వం సమగ్ర వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం రూ.లక్ష పెట్టుబడితో ప్రారంభమైనట్లు చెబుతున్న కంపెనీకి ఇంత విలువైన భూమి ఎలా కేటాయించారనే అంశంపై కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సంబంధించిన సంస్థకు ప్రభుత్వ భూమి కేటాయింపులో ప్రయోజనం కల్పించారంటూ ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. అసెంబ్లీలో తమ గొంతును అణచివేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపిస్తున్న బీఆర్ఎస్ నేతలు.. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ నిర్ణయాలను ఎండగడతామని స్పష్టం చేస్తున్నారు. భూముల కేటాయింపులు, ప్రభుత్వ విధానాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు వంటి అంశాలపై వరుసగా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ పర్యటనలో రాజేంద్రనగర్ నియోజకవర్గం సీనియర్ నాయకులు పోరెడ్డి ధర్మారెడ్డి, శీలం తిరుపతిరెడ్డి, మహమ్మద్ జహీరుద్దీన్, దేవదాస్ తదితరులతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అయితే భూమి కేటాయింపుపై బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం, సంబంధిత సంస్థల నుంచి అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది. ఈ వ్యవహారం రానున్న రోజుల్లో మరింత రాజకీయ దుమారం రేపే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

### సంస్థాన్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా 41వ వర్ధంతి



**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:-** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, పోరాట పటిమ తెలంగాణ ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సూరపల్లి వెంకటేష్, రజక సంఘం అధ్యక్షులు ఉప్పల వెంకటేష్, పిఏసిఎస్ డైరెక్టర్ ఉప్పల కృష్ణ, రాచకొండ రమేష్ బాబు, యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు,కారోబార్ పున్నశీ యాదగిరి, గునిగంటి రాజు గౌడ్, ఏపూరి వెంకటేష్, రిపోర్టర్ సింగం కృష్ణ, రసమల్ల సత్తయ్య, ముత్యాల చంద్రకాంత్, ఏర్పుల సైదులు, రెవనపల్లి లక్ష్మయ్య గంగరాజు, బిక్షం, తదితరులు పాల్గొన్నారు.



## నకిలీ ఎక్స్ ఖాతాతో అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన సీఎం!

### రూల్ 168 కింద సభా హక్కుల ఉల్లంఘన నోటీసు

### సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 09:** నకిలీ ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలోని పోస్టును ఆధారంగా చేసుకుని తెలంగాణ శాసనసభలో నిరాధార ఆరోపణలు చేశారంటూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు అందజేశారు. శాసనసభ నియమావళిలోని రూల్ 168 కింద ఈ నోటీసును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కలిసి అసెంబ్లీ సెక్రటరీ రెడ్ల తిరుపతికి అందజేశారు.సెప్టెంబర్ 9న అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి 'బీఆర్ఎస్ అంతర్జాతీయ కార్యదర్శి సంధ్యారావు' పేరిట ఉన్నట్లు పేర్కొన్న ఎక్స్ ఖాతాలోని పోస్టును సభలో చదివి వినిపించారని ఎమ్మెల్యేలు తెలిపారు. అయితే బీఆర్ఎస్‌లో 'అంతర్జాతీయ కార్యదర్శి' అనే పదవే లేదని, ఆ పేరుతో ఉన్న ఖాతా నకిలీదని వారు ఆరోపించారు.నకిలీ సోషల్ మీడియా ఖాతాలోని సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ముఖ్యమంత్రి శాసనసభలో ప్రస్తావించడం ద్వారా సభను, సభ్యులను తప్పుదోవ పట్టించినట్లవుతుందని వారు పేర్కొన్నారు. వాస్తవ విరుద్ధమైన సమాచారాన్ని పవిత్రమైన శాసనసభలో ప్రస్తావించడం సభా గౌరవానికి భంగం కలిగించే అంశమని ఆరోపించారు. నకిలీ ఎక్స్ ఖాతా సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై తక్షణమే విచారణ జరిపి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ సెక్రటరీని బండారి లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు.

## ఎంజీఐటీలో సెప్టెంబర్ 12న స్మార్ట్? ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్

### 163 బృందాల్లో వెయిమందికి పైగా పాల్గొననున్న విద్యార్థులు

### జాతీయ స్థాయి గ్రాండ్ ఫినాలేకు జట్ల ఎంపిక

**గండిపేట(క్రైమ్‌మిర్రర్):** మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ)లో సెప్టెంబర్ 12 ఇంటర్నల్ స్మార్ట్? ఇండియా హ్యాకథాన్-2026 పోటీలు నిర్వహించనున్నారు. కళాశాల క్యాంపస్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల




వరకు జరిగే ఈ పోటీల్లో ఎంజీఐటీకి చెందిన వెయ్యి మందికిపైగా విద్యార్థులు 163 బృందాలుగా ఏర్పడి పాల్గొననున్నారు. సమాజంలో నెలకొన్న వివిధ సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సరికొత్త, ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొనడంమే హ్యాకథాన్ ప్రధాన ఉద్దేశమని నిర్వహకులు తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మార్గదర్శకాల మేరకు కాలేజ్ ఇన్నోవేన్ సెల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే స్మార్ట్? ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలేకు ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థి బృందాలను ఎంపిక చేసేందుకు ఈ అంతర్జాతీయ పోటీలను స్క్రీనింగ్ ప్రక్రియగా నిర్వహిస్తున్నారు. సుమారు ఏడు గంటల పాటు జరిగే ఈ పోటీల్లో విద్యార్థులు వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, స్మార్ట్? ఆటోమేషన్, పర్యావరణ పరిరక్షణ తదితర రంగాలకు సంబంధించిన క్లిష్టమైన సమస్యలపై వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయనున్నారు. విద్యార్థులు రూపొందించిన నమూనాలు, ప్రాజెక్టులను కళాశాలకు చెందిన వారితో పాటు బయటి నుంచి వచ్చే నిపుణులైన న్యాయనిర్ణేతలు పరిశీలించి మూల్యాంకనం చేయనున్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జట్లు జాతీయ స్థాయి గ్రాండ్ ఫినాలేకు ఎంపిక కానున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యం, సమస్య పరిష్కార సామర్థ్యంతో పాటు బృందంగా పని చేసే నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ హ్యాకథాన్ దోహదపడుతుందని ఎంజీఐటీ యాజమాన్యం పేర్కొంది

## ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడిగా ఆసిఫ్ అలీ నియామకం



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి విభాగం ఎన్ఎస్ యుఐ ఖమ్మం బలోపేతంపై అధిష్ఠానం దృష్టిసారించింది ఈ మేరకు ఖమ్మం జిల్లా ఎన్ఎస్ఈయూఐ అధ్యక్షుడిగా ఖమ్మం నగరానికి చెందిన సయ్యద్ ఆసిఫ్ అలీని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఏడవల్లి వెంకటస్వామి ఉత్తర్వులు జారీ చేశారు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ విద్యార్థుల సమస్యల పరిష్కారం ఎన్ఎస్ యుఐ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని ఆసిఫ్ అలీ తెలిపారు




## విద్యార్థులకు ప్రభుత్వం అందించిన షూ పంపిణీ

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని చిన్న వెంకటగిరి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం అందించిన షూ ను 9వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి కందుకూరి శేషమ్మ వెంకటనారాయణ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్యా సామగ్రిని అందిస్తూ వారి విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు షూ ను అందించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి, మంత్రిగారి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి తంబురి దయాకర్ రెడ్డి, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ లిక్ఖెరు హరినాథ్ బాబు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రిలో వైభవంగా ప్రారంభమైన సింగరేణి 62వ వార్షిక క్రీడలు

**మందమర్రి (ఆగస్టు 10) (క్రైమ్ మిర్రర్):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మందమర్రి ఏరియా అంతర్ విభాగీయ 62వ వార్షిక క్రీడా పోటీలు గురువారం ఉదయం స్థానిక సింగరేణి హైస్కూల్ మైదానంలో అత్యంత వైభవంగా, ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను అధికారికంగా ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా తొలిరోజు ఫుట్ బాల్ పోటీలను నిర్వహించారు. జిఎం రాధాకృష్ణ టాస్ వేసి, కాసిపేట-2 మరియు కేకే-5 జట్ల మధ్య తొలి మ్యాచ్‌ను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని, వారిని ఉత్సాహపరుస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



**ఆరోగ్యం, క్రమశిక్షణకే క్రీడలు: జిఎం రాధాకృష్ణ**

ఈ సందర్భంగా జిఎం రాధాకృష్ణ మాట్లాడుతూ.. నిత్యం పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు క్రీడలు మంచి శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన ఉద్యోగులతోనే సంస్థ మెరుగైన బొగ్గు ఉత్పత్తి సాధించి అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. సింగరేణి యాజమాన్యం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగానే ప్రతి ఏరియాకు క్రీడా సామగ్రి కొనుగోలు కోసం ?4.50 లక్షల నిధులను కేటాయించిందని తెలిపారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని, ఆటలలో చూపించే పట్టుదల, క్రమశిక్షణను పని ప్రదేశంలోనూ ప్రదర్శించి సంస్థ పురోగతికి భాగస్వాములు కావాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. కంపెనీ, కోల్ ఇండియా స్థాయి పోటీలలోనూ పాల్గొని మందమర్రి ఏరియా ఖ్యాతిని చాటాలని ఆకాంక్షించారు.

**తొలిరోజు ఫుట్‌బాల్ విజేత కేకే-5**

ఉత్కంఠభరితంగా సాగిన తొలిరోజు ఫుట్ బాల్ టోర్నమెంట్‌లో కేకే-5 జట్టు విజేతగా నిలవగా, కాసిపేట-2 జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓ-టు-జిఎం జి.ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) సిహెచ్. అశోక్, క్రీడల కార్యదర్శి ఎం. కార్తీక్, సమన్వయకర్త ఎస్. శివకృష్ణ, జనరల్ కెప్టెన్ సాక శ్రీనివాస్, వివిధ విభాగాల కెప్టెన్లు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు మరియు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు.



# గండిపేటలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి

## భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

**గండిపేట(క్రైమ్‌మిర్రర్):** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని గండిపేట మండలంలోని కాళీ మందిర్ కార్మికుల అడ్డా వద్ద ఘనంగా నిర్వహించారు. సీనియర్ కార్మికురాలు లక్ష్మమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ నివాళి కార్యక్రమానికి అడ్డా అధ్యక్షులు అశోక్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి సిఐటియు గండిపేట మండల సీనియర్ నాయకులు అశోక్, మహిళా నాయకురాలు కవిత, నాయకులు పుల్లారావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా, పేదలు, మహిళలు, అణగారిన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆడబిడ్డల ఆత్మగౌరవం కోసం ఆమె చూపిన ధైర్యం, తెగువ నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల సాధనకు ఐక్యత ఎంతో అవసరమని, కార్మికులు సంఘటితంగా పోరాడినప్పుడే తమ హక్కులను సాధించుకోగలరని నాయకులు అన్నారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాళీ మందిర్ కార్మికుల అడ్డాకు చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని చాకలి ఐలమ్మకు ఘనంగా జోహార్లు అర్పించారు.

# వీర వనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి స్ఫూర్తిదాయకం

## జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జ్యోతి



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** వీర వనిత చాకలి ఐలమ్మ ప్రదర్శించిన పోరాట స్ఫూర్తి స్ఫూర్తిదాయకమని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి అన్నారు. స్థానిక వైరా రోడ్డులోని ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా ఉన్న వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద గురువారం జిల్లా వెనక బడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి పాల్గొని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి మాట్లాడుతూ సమాజంలోని అసమానత్వానికి ఎదురొడ్డి నిర్భయంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని జమీందార్ల పాలనలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా అనేక సంఘాలలో ఆమె స్ఫూర్తి నింపారని అన్నారు. చాకలి ఐలమ్మ సంఘ సేవకురాలిగా భూ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాట పటిమతో వీర వనితగా చరిత్రలో నిలిచి ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. సమాజహితం కొరకు పోరాడిన మహనీయుల స్ఫూర్తి వారి త్యాగాలు గొప్పతనం ప్రజలకు తెలిసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వారి వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. చాకలి ఐలమ్మ కు గుర్తింపు అందించడంలో భాగంగా కోఠిలోని మహిళ యూనివర్సిటీకి ప్రభుత్వం చాకలి ఐలమ్మ పేరు పెట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ సొసైటీ చైర్మన్ ఎలగొండ స్వామి రజక కులసంఘ నాయకులు బిసి కుల సంఘ నాయకులు జక్కుల వెంకటరమణ తమ్మరపు బ్రహ్మం మాచర్ల యెలాద్రి కోడి లింగయ్య నట్టు వెంకటేశ్వర్లు కత్తి నెహ్రూగౌడ్ మునిగ కోటేశ్వరరావు ఎల్లురి విజయ్ కుమార్ ఎస్ కే సయ్యద్ బాషా వల్లపు సోమరాజు అప్పారావు ఉపేందర్ పడిగల కృష్ణవేణి రమాదేవి బాబురావు సత్యనారాయణ హనుమంతు రావు వెంకన్న రమణ కుమార్ సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారులు ఖమ్మం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయం సిబ్బంది వసతిగృహ సంక్షేమ అధికారులు రజక సంఘ నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రూ.10,500 కోట్ల స్కాలర్‌షిప్-ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

## ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

## పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నా

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 10:** పెండింగ్‌లో ఉన్న రూ.10,500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. స్థానిక ఐటీఐ నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నా చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యార్థులకు పెద్దపీట వేస్తామని చెబుతున్న ప్రభుత్వం, మరోవైపు విద్యార్థులను విద్యకు దూరం చేసే విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న రూ.10,500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి అనేక మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగిస్తున్నారని, నిధులు విడుదల చేయకపోతే వారు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. గతంలో మాదిరిగానే విద్యార్థులకు నేరుగా నిధులు అందించే విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వేలాది ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే నిర్ణయం గ్రామీణ ప్రాంత విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతుందని శ్రీకాంత్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, సరిపడా ఉపాధ్యాయులు, స్కావెంజర్లను నియమించాల్సిన ప్రభుత్వం పాఠశాలలను మూసివేయాలని నిర్ణయించడం సరికాదన్నారు. పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకుని విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించాలని కోరారు. డిమాండ్లను పరిష్కరించకపోతే భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో పి.డి.ఎస్.యు జిల్లా సహాయ కార్యదర్శి ఈ. గోపాల్, డివిజన్ నాయకులు సునీల్, ప్రసాద్, శ్రీకాంత్, క్రాంతి, వీరమణి, ఐశ్వర్య, సాహితి, సాయి ప్రియ, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.




# 250 కంపెనీలతో వేలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు

## ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ, ఐటీఐ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

**కోదాడ, సెప్టెంబర్ 10 (క్రైమ్ మిర్రర్)** సూర్యాపేట జిల్లాతోపాటు ఉమ్మడి నల్లగొండ, పొరుగున ఉన్న ఖమ్మం జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో సెప్టెంబర్ 19న కోదాడలో భారీ స్థాయిలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ జాబ్ మేళాకు 200 నుంచి 250 కంపెనీలను ఆహ్వానించి వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. కోదాడలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా ఏర్పాట్లపై గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి, పరిశ్రమలు--వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహాతో పాటు సంబంధిత శాఖల అధికారులు, కార్యక్రమ నిర్వాహక ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యావంతులైన యువతలో నిరుద్యోగం సమాజం ఎదుర్కొంటున్న తీవ్రమైన సవాళ్లలో ఒకటని మంత్రి పేర్కొన్నారు. యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు. "విద్యావంతులైన నిరుద్యోగ యువత, వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న కష్టాలను ప్రతిరోజూ చూస్తున్నాం. ఎమ్మెల్యేగా, ఎంపీగా, ఇప్పుడు మంత్రిగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నాను. నిజమైన ఉపాధి అవకాశాలను అందించి వారి కుటుంబాలకు భరోసా కల్పించడమే ఈ మెగా జాబ్ మేళా ప్రధాన లక్ష్యం" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. హుజూర్‌నగర్ జాబ్ మేళాకు భారీ స్పందనగత ఏడాది అక్టోబర్‌లో హుజూర్‌నగర్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అపూర్వ స్పందన లభించిందని మంత్రి గుర్తుచేశారు. ఆ జాబ్ మేళాలో సుమారు 200 కంపెనీలు పాల్గొనగా, దాదాపు 40 వేల మంది నిరుద్యోగ యువత నమోదు చేసుకున్నారని, వారిలో సుమారు 20 వేల మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని తెలిపారు. దాదాపు 3 వేల మంది ఉద్యోగాలు పొందడం లేదా తదుపరి దశ ఇంటర్వ్యూలకు ఎంపిక కావడం జరిగిందని వివరించారు. హుజూర్‌నగర్ జాబ్ మేళా విజయంతో స్ఫూర్తి పొంది, అంతకంటే భారీ స్థాయిలో కోదాడలో మెగా జాబ్ మేళా నిర్వహించాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. నాలుగు నియోజకవర్గాల యువతకు విస్తృత ప్రచారంకోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలతోపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఇతర ప్రాంతాలు, పొరుగున ఉన్న ఖమ్మం జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలు, ఐటీఐలకు ప్రత్యేక బృందాలను పంపించి, ముఖ్యంగా చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులను జాబ్ మేళాకు ఆహ్వానించాలని సూచించారు. సోషల్ మీడియా, స్థానిక ప్రచార కార్యక్రమాలు, ఇతర సమాచార వేదికల ద్వారా జాబ్ మేళా వివరాలను ప్రతి అర్హుడైన నిరుద్యోగ యువతకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



**200--250 కంపెనీల రాకకు ఏర్పాట్లు**

హైదరాబాద్, ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి 200 నుంచి 250 కంపెనీలను జాబ్ మేళాకు రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. కంపెనీలతో సమన్వయం, అభ్యర్థుల సమీకరణ, నమోదు, ఇంటర్వ్యూల నిర్వహణ, వేదిక ఏర్పాట్లు తదితర బాధ్యతలను ప్రత్యేక బృందాలకు అప్పగించాలని సూచించారు. కోదాడలోని సి.సి. రెడ్డి కాన్వెంట్‌ను మెగా జాబ్ మేళా వేదికగా ఖరారు చేసినట్లు మంత్రి వెల్లడించారు. కాన్వెంట్‌లోని 32 గదులను వివిధ కంపెనీల ఇంటర్వ్యూ ప్యానళ్లకు కేటాయించవచ్చని, అదనంగా వచ్చే కంపెనీల కోసం మైదానం, పరిసర ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అభ్యర్థుల నమోదు, ఇంటర్వ్యూల నిర్వహణ, వాహనాల పార్కింగ్, భోజనం, తాగునీరు తదితర సౌకర్యాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంతమంది అభ్యర్థులు హాజరైనా ప్రతి ఒక్కరికీ భోజన సదుపాయం కల్పించాలని స్పష్టం చేశారు. ఉదయం ప్రారంభమయ్యే నియామక ప్రక్రియ అవసరమైతే సాయంత్రం వరకు కొనసాగించాలని, జాబ్ మేళాకు హాజరయ్యే ప్రతి అభ్యర్థికీ ఇంటర్వ్యూలో పాల్గొనే అవకాశం కల్పించాలని మంత్రి సూచించారు.

ఈ మెగా జాబ్ మేళాను ప్రభుత్వ కార్యక్రమంగా, నిర్దేశిత ప్రొటోకాల్ ప్రకారం నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు చురుగ్గా పాల్గొని, కార్యక్రమ విజయాన్ని సమష్టి బాధ్యతగా స్వీకరించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

# వెట్టిచాకిరీపై తిరుగుబాటు.. ఐలమ్మ పోరాటం చిరస్మరణీయం

## తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వర్ధంతి కార్యక్రమం

## విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 10: వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ ధైర్యంగా సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని నాయకులు పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన తెగువ, పోరాట పటిమ నేటి తరానికి ఆదర్శమని అన్నారు. సామాజిక అసమానతలను రూపుమాపి, సామాజిక న్యాయం సాధించే దిశగా ఐలమ్మ ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో సామాజిక న్యాయం కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం సుధాకర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవి తదితరులు పాల్గొన్నారు.




Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.